
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
బుధవారం, 22.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 180
పేజీలు: 12 వెల: రూ. 5

# ప్లాన్ బీ..
## గండం గట్టెక్కేదెలా?

- సీఎంకు అజారుద్దీన్ టెన్షన్
- ఏఐసీసీ నుంచి ఒత్తిడి
- మరోసారి కేబినెట్ సిఫారసు
- గవర్నర్ కు సీఎం రిక్వెస్ట్..?




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మంత్రి అజారుద్దీన్ పదవీ గండం సీఎం రేవంత్ రెడ్డి మెడకు చుట్టుకుంది. అజారుద్దీన్ పదవిని కాపాడేందుకు సీఎం నానా విధాలుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అటు ఏఐసీసీ నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో.. మరోసారి కేబినెట్ లో తీర్మానం చేసి గవర్నర్‌కు ఫైల్ పంపించాలని నిర్ణయం తీసుకున్నారు. అజారుద్దీన్‌కు ఈ నెల 30కి మంత్రిగా బాధ్యతలు చేపట్టి 6 నెలలు అవుతుంది. ఆ లోపు ఎమ్మెల్సీగా ఎన్నిక కాకపోతే రాజీనామా చేయాలి. దీంతో ఇప్పుడు పదవి గండం పట్టి పీడిస్తోంది.

**సీఎం చేతుల్లోనే ఉందా..?**

రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి లోక్‌భవన్ వైపే ఉంది. మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరాంల ఎమ్మెల్సీ నామినేషన్ల ఫైల్ క్లియరెన్స్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో సీఎం ఆదివారం సమావేశం అయ్యారు. కానీ క్లారిటీ **మిగతా 02లో**

## ఆర్టీసీ సమస్యలపై ప్రభుత్వం నిర్ణయం
### నాలుగు వారాల్లో నివేదికకు అధికారుల కమిటీ



- జీఓఎంఎస్ నెం.66తో ఆర్టీసీ ఉద్యోగుల అంశాల పరిశీలనకు కమిటీ ఏర్పాటు
- సేవా నిబంధనలు, వేతనాలు సహా అన్ని సమస్యలపై సమగ్ర అధ్యయనం
- నాలుగు వారాల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్న కమిటీ
- సమ్మెలు లేకుండా పరిష్కారం దిశగా ప్రభుత్వం సానుకూల సంకేతాలు 03

## రేవంత్ రెడ్డి రాహువు.. కేసీఆర్ కేతువు
### ఇద్దరూ కలిసి తెలంగాణ ప్రజలను చంపుకుతింటున్నారు
### కేసీఆర్, రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్

- కాళేశ్వరం స్కాంలో కేసీఆర్ ను కాపాడుతోంది రేవంత్ రెడ్డే
- కాళేశ్వరంపై సీఎం రేవంత్ యూ టర్న్
- రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని చెప్పి సీబీఐకి రూ.9 వేల కోట్ల స్కామ్ జరిగినట్లు లేఖ
- ఏ ఆధారాలను బట్టి సీబీఐ విచారణ చేపట్టాలో వివరణ ఇవ్వాలి 03




## రేవంత్‌కు సీఎం పదవి కేసీఆర్ పుణ్యమే..
### చంద్రబాబు స్కెచ్ తోనే రేవంత్ కాంగ్రెస్‌లో చేరిండు



- రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చారు
- జగిత్యాలలో మాజీమంత్రి జీవన్ రెడ్డి హాట్ కామెంట్స్ 10

-ముద్ర ప్రతినిధి, జగిత్యాల

## బదిలీలకు గ్రీన్ సిగ్నల్
### ఉద్యోగ బదిలీలపై ఉన్న నిషేధం ఎత్తివేత



- మే 1 నుంచి మే 31 వరకు
- ఉత్తర్వులు జారీ 10

# ఆర్టీసీలో సమ్మె సైరన్
## నేటి నుంచి సమ్మెలో కార్మికులు
### న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నాం

- సమ్మెకు అన్ని సంఘాలూ మద్దతు తెలిపాయి
- ఇప్పటివరకూ ఆర్టీసీ అధికారులు, ప్రభుత్వం చర్చలకు పిలవలేదు
- సమ్మె నివారణ చర్యలు కూడా చేపట్టలేదు
- ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ఆర్టీసీ సమ్మెకు సిద్ధమైంది. డిమాండ్లను పరిష్కరించాలంటూ నేటి నుంచి సమ్మె చేయాలని టీఎస్ఆర్టీసీ జేఏసీ నిర్ణయించింది. ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల పునరుద్ధరణ, రెండో వేతన సవరణ, విశ్రాంత ఉద్యోగుల బకాయిల చెల్లింపు వంటి కీలక డిమాండ్లతో కార్మికులు సమ్మె నిర్ణయం తీసుకున్నారు. కార్మిక సంఘాల నేతలు ఈదురు వెంకన్న, థామస్ రెడ్డి నేతృత్వంలోని జేఏసీతో పాటు, గతంలో దూరంగా ఉన్న అశ్వథ్థామరెడ్డి వర్గం కూడా సమ్మెకు మద్దతు తెలపడం గమనార్హం. సమ్మెపై ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మంగళవారం **మిగతా 02లో**

# ఎవరి సంబురం వారిదే
## రేవంత్ vs కేసీఆర్.. విజయమెవరిది?
### హోరుగా సాగిన 'సభా' సంగ్రామం

- కేసీఆర్ కమ్ బ్యాక్ ప్లాన్
- రేవంత్ బ్రేక్ పాయింట్
- మధ్యలో కవిత కాళేశ్వరం పంచ్ లు
- సభ సక్సెస్ ఎవరిది?
- కేసీఆర్ వ్యూహాలపైనే అనుమానాలు
- మళ్లీ గర్జించేది ఎప్పటికో?
- రెండున్నరేండ్లు.. అయినా సీఎం పేరెత్తని మాజీ సీఎం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** సభ సక్సెస్.. ఇప్పుడు రాష్ట్రంలో ఎవరి సంబురం వారిదే. గులాబీల దండు కదిలింది.. జగిత్యాల జైత్రయాత్ర కనిపించింది.. కేసీఆర్ కు ప్రజా ఆశీర్వాదం మొదలైంది.. సభ సక్సెస్ అయింది.. ఇదీ బీఆర్ఎస్ మాట. ఇక, రేవంత్ రెడ్డి పంచ్ వదిలాడు. కేసీఆర్ అక్రమాలకు సజీవ సాక్ష్యం కాళేశ్వరంపై పట్టు పట్టారు. పంచ్ కు పంచ్.. మాటకు మాట.. దెబ్బకు దెబ్బ.. రేవంత్ దూకుడు పెంచారు.. ఇది కాంగ్రెస్ వాదన. ఇరు వర్గాల సంబురం.. కౌంటర్లు, ఎదురు కౌంటర్లు మండే ఎండలతో అల్లాడుతుంటే.. మధ్యలో కవిత దూరారు. కాళేశ్వరంపై విమర్శలు చేశారు. తండ్రిని అనుమానించారు. కేంద్రాన్ని ఎందుకు నిలదీయాలే.. నిండు సభలో అంటూ ప్రశ్నించారు. గుంటనక్క ఢిల్లీకి వెళ్లింది అంటూ హరీశ్ రావుపై మళ్లీ మాటల యుద్ధం చేశారు.

మొత్తంగా ఒక్క రోజులో రాజకీయం హీట్ పెంచింది. ఎన్నో విమర్శలు.. వాడీ వేడి పరిణామాలు. చర్చకు తెరతీసిన పర్యటనలు. ప్రకటనలు. చాలా రోజుల తరువాత కేసీఆర్ గర్జన.. మొత్తంగా అన్ని పార్టీలను అత్మనిబ్బరంలో పడేశాయి. ఇలాంటి సమయంలో కవిత మాత్రం రెండు పార్టీలకు బాణాలు గుచ్చుతూనే ఉన్నారు. వీటన్నింటికీ మరో అదనపు పొలిటికల్ హీట్ ఏంటంటే.. కేసీఆర్ నోటి వెంట రేవంత్ పేరు రాకపోవడం. రెండున్నరేండ్లు.. సీఎం రేవంత్ అని ఒక్కసారి.. ఒక్కమాట కూడా కేసీఆర్ నోటి నుంచి రాలేదు. ఇక వస్తదనే నమ్మకం కూడా లేదు. ఎందుకంటే కేసీఆర్ **మిగతా 02లో**




## జాబ్ మానేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ 'గంజాయి' సాగు
### మత్తుకు బానిసై ఉద్యోగం పోయింది
### 17 మొక్కలతో పట్టుబడిన టెక్కీ.. 09



## కేసీఆర్, రేవంత్ రెడ్డిలో ఎవరెంటో తేలిపోయింది
### మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు 10

- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే అధికారం
- జగిత్యాలలో కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాల గురించి మాట్లాడారు
- నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి రహస్యం లేదు



## భూ వివాదాల పరిష్కారంలో సువర్ణాధ్యాయం
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



- కుసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్
- సర్వే(ఎల్.పి.ఎం). భూధార్ నెంబర్ల కేటాయింపు
- భూమి హక్కులకు శాశ్వత భరోసా 10


## ఉప్పల్ లో సెంచరీతో అభి'షేక్' విధ్వంసం
### 47 బంతుల్లో శతకం.. ఢిల్లీ బౌలర్లపై దాడి

- హెడ్, ఇషాన్‌తో భారీ భాగస్వామ్యాలు..
- స్కోర్ బోర్డ్ దూసుకెళ్లిన హైదరాబాద్
- వరుసగా హాఫ్ సెంచరీ, సెంచరీ.. ఫామ్‌లోకి తిరిగొచ్చిన అభిషేక్
- సిక్సర్ల వర్షంతో ఉప్పల్ మైదానం మార్మోగింది
- ఏడు మ్యాచ్లలో 305 పరుగులు..
- ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్న సన్‌రైజర్స్ ఓపెనర్ 11



## ఇది AI ముద్ర

సూర్యుడు డే డ్యూటీనే కాదు.. రాత్రి డ్యూటీ కూడా చేస్తున్నాడు. పగలు ఎండ, రాత్రి ఆ వేడి ఉక్కపోత తగ్గక జనాలు నరకం అనుభవిస్తున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 22.04.2026
www.mudranews.in | @mudranews




సైకిల్ చరిత్ర



1817లో కార్ల్ డ్రైస్ తయారు చేసిన "డ్రైసిన్"నే ఆధునిక సైకిల్‌కు తొలి రూపంగా చూపారు. ఇది పెడల్స్ లేకుండా కాళ్లతో వాహనం తోసుకుంటూ వెళ్లే.

# ఎవరి సంబురం వారిదే

- కేసీఆర్ కమ్ బ్యాక్ ప్లాన్
- రేవంత్ బ్రేక్ పాయింట్
- మధ్యలో కవిత కాళేశ్వరం పంచ్ లు
- సభ సక్సెస్ ఎవరిది?
- కేసీఆర్ వ్యూహాలపైనే అనుమానాలు
- మళ్లీ గర్జించేది ఎప్పటికో?



**(మొదటి పేజీ తరువాయి)**

కచ్చితంగా వేస్తున్న సెటైర్లన్నీ వ్యక్తులు, పార్టీలను బట్టే. పేరెత్తకుండానే సదరు నాయకున్ని నడిబజారున నిలుబెడుతున్నాడు. దీనికి తోడు రాజకీయంగా ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నా.. మధ్యలోకి కచ్చితంగా కవిత వస్తున్నారు. అది కాంగ్రెస్ అయినా.. బీఆర్ఎస్ అయినా. బీఆర్ఎస్‌ను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదు అన్నట్టుగానే ఆమె రాజకీయంగా వేస్తున్న అడుగులు ఉంటున్నాయి.

**ట్రాక్ లోకి కేసీఆర్**

మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ ట్రాక్ ఎక్కే ప్రయత్నం చేశారు. జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభతో కమ్ బ్యాక్ చేసేలా కథ నడిపారు. ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఏడాది తర్వాత బయటికొచ్చారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరిన సందర్భంగా సభ అయితే నిర్వహించారు. అది లేకపోతే బయటకు వచ్చే వారేనా అన్న ప్రశ్నలు వినిపించాయ్. కార్యకర్తల్లో చాలా రోజులకు జోష్ అయితే నింప గలిగారు కేసీఆర్. మరి ఇదంతా వన్ టైమ్ జోష్‌గా మిగిలిపోతుందా? రోజూ జనంలో ఉంటే ఆ జోష్ రాదు అనుకుంటున్నారా? అందుకే అప్పుడప్పుడే జనంలో మెరుస్తున్నారా అనే అనుమానాలు సొంత పార్టీలోనే వస్తున్నాయి.

**ఏడాది తర్వాత కేసీఆర్ గర్జన**

ఒకే రోజు సీఎం, మాజీ సీఎం సభలతో మ్యాటర్ హీటెక్కిపోయింది. రెండు పోటాపోటీ పొలిటికల్ సభలతో తెలంగాణ రాజకీయం ఎండలకంటే మండిపోయింది. జగిత్యాలలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ఎమోషనల్, ఫైర్ ఫుల్ స్పీచ్ ఇచ్చారు. దాదాపు ఏడాది తర్వాత కేసీఆర్ పాల్గొన్న పబ్లిక్ మీటింగ్ కు గులాబీ క్యాడర్‌లో ఉత్సాహం కనిపించింది. క్యాడర్ తరలి వచ్చారు. సోషల్ మీడియాలో ట్రెండ్ అయింది. అయితే ఇది ఒక్క సభ మాత్రమే. ఏడాది సైలెన్స్ తర్వాత చేసిన స్పీచ్ తో మొత్తం మారిపోతుందా? అన్న ప్రశ్నలు వస్తున్నాయ్.

**కేసీఆర్ ఫైర్ స్పీచ్‌పై ప్రశ్నలు**

2023 అసెంబ్లీ ఓటమి.. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో జీరో సీట్లు. దీంతో బీఆర్ఎస్ క్యాడర్‌లో నైరాశ్యం పెరిగింది. ఇప్పుడు కొందరు ఎమ్మెల్యేలు పార్టీకి దూరంగా ఉన్నారు. అధికార పార్టీకి దగ్గర అయ్యారు. వీటికి తోడు కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్‌లో ఎక్కువగా ఉండటం, అసెంబ్లీకి రాకపోవడంతో నాయకుడు ఎక్కడ అన్న ప్రశ్నలు పెరిగాయ్. కొందరైతే కేసీఆర్ ఎక్కడ అని గజ్వేల్ లో నిరసన ప్రదర్శనలు కూడా చేశారు. చాలా సవాళ్లు, ప్రశ్నల మధ్య కేసీఆర్ అయితే బయటకు వచ్చారు. చెప్పాల్సింది చెప్పారు. క్యాడర్ కోరుకున్న నాలుగు డైలాగ్ లు కొట్టారు. కాంగ్రెస్ ను కార్నర్ చేశారు. ఉత్సాహం నింపి వెళ్లారు. మరి ఇది సరిపోతుందా అన్న ప్రశ్నలు వస్తున్నాయ్. ఎన్నికలకు ఇంకా చాలా టైమ్ ఉంది. బట్ రాత్రికి రాత్రి వచ్చి మ్యాజిక్ చేసే పరిస్థితి కూడా లేదు కదా అన్న చర్చ పార్టీలో జరుగుతోంది. ఇప్పటి నుంచే యాక్షన్ ప్లాన్ మొదలైతేనే ప్రభుత్వాన్ని ధీటుగా ఎదుర్కోవచ్చు అన్న వాదన వినిపిస్తున్న వారూ ఉన్నారు. అటు రేవంత్ ప్రభుత్వం కూడా తమదైన వ్యూహాల్లో ఉంది. దేనికైనా కౌంటర్ ఇచ్చేందుకు రెడీ అంటోంది.

**కేసీఆర్‌కి అసలు పరీక్ష ఇప్పుడే**

జగిత్యాల సభ బీఆర్ఎస్ కు ఒక బూస్ట్ అయితే ఇచ్చింది. కానీ రెగ్యులర్ క్యాంపెయిన్, బూత్ లెవల్ యాక్టివిటీ లేకపోతే క్యాడర్ మళ్లీ నిరాశకు లోనవుతుందన్న టాక్ కూడా ఉంది. ప్రత్యర్థి చేసే తప్పులే తమకు అధికారం కట్టబెడుతాయి అన్న ధోరణి బీఆర్ఎస్ నాయకత్వంలో ముఖ్యంగా కేసీఆర్ లో కనిపిస్తోంది. అయితే అది అంత వర్కవుట్ కాదన్న విశ్లేషణ ఉంది. ఎందుకంటే ఎన్నికలు వచ్చాక ఎవరి మాస్టర్ ప్లాన్లు వారికి ఉంటాయి. బీఆర్ఎస్ రెండో టర్మ్ అధికారంలోకి రావడానికి కారణం.. అప్పటికప్పుడు రైతుబంధు ప్రకటించారు. ఇది గేమ్ ఛేంజర్ అయింది. రేవంత్ ప్రభుత్వం కూడా ఏ ఇష్యూ అయినా ధీటుగా ఎదుర్కొనేందుకు రెడీగా ఉంది. KCR యాక్టివ్ అయితే రాజకీయాలు కేసీఆర్ వర్సెస్ రేవంత్ గా మారిపోతాయి. అటు రేవంత్ ప్రభుత్వం కూడా యాక్టివ్ గా ఉంది. సోమవారం జరిగిన ఈ రెండు సభలు చూస్తే పొలిటికల్ హీట్ ఎంత వేడెక్కిందో అర్థం చేసుకోవచ్చు.

**కాంగ్రెస్ చాలెంజ్.. కేసీఆర్ సైలెన్స్**

పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ ప్రతిపక్ష నేతగా మాత్రం పెద్దగా నోరు మెదపడం లేదు. కేసీఆర్ హయాంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాలపై చర్చిద్దామని కాంగ్రెస్ నేతలు చాలెంజ్ చేస్తున్నా స్పందించడం లేదు. కాంగ్రెస్ పాలనలో ఎవరికీ ఏమీ దక్కలేదని మాట్లాడిన కేసీఆర్.. తన హయాంలో జరిగిన వాటిపై చర్చకు ఎందుకు ముందుకు రావడం లేదన్న ప్రశ్నలను కాంగ్రెస్ నేతలు వినిపిస్తున్నారు. సభలో తాను అనుకున్నది కేసీఆర్ చెప్పేశారు. బట్ చాలా ప్రశ్నలకు జవాబులు అలాగే మిగిలిపోయాయ్. అసెంబ్లీకి రాకపోవడం, ఫాంహౌజ్ కే పరిమితం, క్యాడర్ యాక్టివిటీ తగ్గడం, హరీష్ రావు, కేటీఆర్ వర్గాలు, కుంపట్లు.. ఓవైపు కవిత పంచులు.. తనకు ఎవరైనా ఒకటే అన్నట్లు డైలాగ్ లు, బీజేపీని టార్గెట్ చేయకపోవడం, కాళేశ్వరం సహా ఇతర విచారణలపై భయమెందుకన్న ప్రశ్నలు వస్తున్నాయి.

**కేసీఆర్ పై కవిత సెటైర్లు**

జీవన్ రెడ్డిని పార్టీలో చేర్చుకోవడంపై బిఆర్ఎస్ అధినేత, ఆమె తండ్రి కేసీఆర్ పైనే సెటైర్లు వేశారు. జగిత్యాల సభలో బిఆర్ఎస్ 75 సంవత్సరాల కురువృద్ధుడ్ని చేర్చుకుని ఒక నవయువకుడిగా చెబితే, తెలంగాణలో యువత బతికి ఉందా లేదా? తెలంగాణలో యువత భవిష్యత్ ఏంటి అని సూటిగానే క్వశ్చన్ చేశారు. గతంలోనూ బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ ప్లస్ మైనస్ లతో పెద్ద లేఖ రాశారు. అది కాస్తా లీకై పెద్ద సంచలనంగా మారింది. మహిళా బిల్లు, డీలిమిటేషన్ పై ఎందుకు మాట్లాడలేదని అటాక్ చేశారామె. బీఆర్ఎస్ లో ఆడబిడ్డలకు విలువ ఇవ్వరని ఫైర్ అయ్యారు. వెయ్యేళ్లైనా బీఆర్ఎస్ మారదు అని డైరెక్ట్ గానే తండ్రికి, సోదరుడికి కౌంటర్ ఇచ్చారు కవిత.

**బీఆర్ఎస్ కు తలనొప్పిగా మారిన కవిత**

బీఆర్ఎస్ కు ఇంకో సమస్య కవిత నుంచే ఉంది. సొంత కూతురే పార్టీ మారి మరో పార్టీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిపై గులాబీ పార్టీ నుంచి ఎవరూ మాట్లాడడం లేదు. గతేడాది కవిత కేసీఆర్ కు 6 పేజీల లెటర్ రాశారు. కేసీఆర్ దేవుడు, కానీ చుట్టూ దెయ్యాలు ఉన్నారు అని చెప్పడం ద్వారా హరీష్ రావు, సంతోష్ రావు లాంటి వాళ్లను టార్గెట్ చేశారు. కుటుంబంలో ఎలాంటి విబేధాలు ఉన్నాయో బయటకు ఈ ఘటనలతో తెలిసింది. అయితే ఈ ఎపిసోడ్ పై కేసీఆర్ ఇంకా పబ్లిక్‌గా రియాక్ట్ అవలేదు. ఇది బీఆర్ఎస్ కు ఎంతో కొంత డ్యామేజ్ చేసే అవకాశం కనిపిస్తోందంటున్నారు. ఇలాంటి వాటితో సంబంధం లేకుండా.. కేసీఆర్ తన స్టైల్ లోనే ప్రస్తుతం ప్రభుత్వం ఎలా వైఫల్యం చెందిందో వాటినే కార్నర్ చేశారు.

**కాంగ్రెస్ నేతలు సవాల్**

కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రానికి శాపంలా మారాయని, ప్రస్తుత సమస్యలన్నింటికీ మూలాలు ఆయన దగ్గరే ఉన్నాయన్నది కాంగ్రెస్ నేతలు చేస్తున్న వాదన. తమ వద్ద అన్ని ఆధారాలున్నాయని, కేసీఆర్ చర్చకు వస్తే చూపుతామని సవాల్ విసురుతున్నా.. సభకు కూడా రావడం లేదన్న విషయాన్ని హైలైట్ చేస్తున్నారు. ప్రాజెక్టులు పండవెట్టారని విమర్శిస్తున్న కేసీఆర్.. బనకచర్ల ప్రాజెక్టుపై కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చకు మాత్రం రావడం లేదు ఎందుకు అని క్వశ్చన్ చేస్తున్నారు. వీటిపై గులాబీ బాస్ ఏవీ టచ్ చేయడం లేదు. కాళేశ్వరం కూలినా మాట్లాడకపోవడంపై సీఎం రేవంత్ పై తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు.

**తాడో పేడో అంటున్న రేవంత్**


ఎవరి ప్రభుత్వంలో ఏం జరిగిందో.. లెక్కలు తేల్చే పని చేశారు కేసీఆర్, రేవంత్. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనకు, కేసీఆర్ పదేళ్ల పాలనకు మధ్య పొలిటికల్ గేమ్ గట్టిగానే నడిచింది. చర్చ ఎక్కడ పెట్టినా రెడీ అంటూ కాంగ్రెస్ ఘాటు రిప్లైలు ఇచ్చింది. ఇక తాడో పేడో అంటూ గట్టిగానే మాట్లాడారు రేవంత్.

**2034 దాకా కాంగ్రెసే ఉంటుంది**

నిజంగానే.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో గతేడాది ఏప్రిల్ 27న నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ ఓ మాటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాదిన్నర టైమిచ్చిన. ఇగ ఊకోను. జనం కోసం బైలెళ్త. ఎవనిలెక్కందో తీస్త అంటూ ఆవేశంగా మాట్లాడారు. సీన్ కట్ చేస్తే ఏడాది తర్వాత జగిత్యాల సభలో కనిపించారు. ఈ మధ్యలో అంతా ఫాంహౌజ్ కే పరిమితం అయ్యారు. కేసీఆర్ పై పొలిటికల్ గా తాడో పేడో అని సీఎం రేవంత్ డిసైడైనట్లు కనిపిస్తున్నారు. రేవంత్ స్ట్రాటజీని ఎదుర్కోవడం ఈజీ అని గులాబీ దళం అనుకుంటోంది. అయితే తమ వ్యూహాలు తమకు ఉన్నాయని కాంగ్రెస్ అంటోంది. 2034 దాకా కాంగ్రెస్సే ఉంటుంది అనడానికి రీజన్ కూడా ఉందంటున్నారు. BRSను ఓడించే మాస్టర్ ప్లాన్ రేవంత్ దగ్గర ఉండడంతోనే ఆ కాన్ఫిడెన్స్ తోనే మాట్లాడుతున్నారంటున్నారు.

**కౌంటర్లు స్టార్ట్**

కేసీఆర్ ప్రసంగంపై కౌంటర్లు మొదలయ్యాయి. ఆరు లక్షల కోట్ల అప్పు సంగతేంటని మంత్రి కోమటిరెడ్డి క్వశ్చన్ చేస్తున్నారు. కాళేశ్వరం రిపేర్ చేసినా నిలబడుతుందన్న గ్యారెంటీ లేకుండా పోయిందన్నారు. అసలు నల్గొండకు కేసీఆర్ ఏం చేశారో చెప్పాలన్నారు. సన్నబియ్యం ఆలోచనే లేదని, పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. పదేళ్ల పాలనలో కోట్లు సంపాదించుకున్నారని, తెలంగాణ ప్రజలను అప్పుల్లో ముంచేశారని కాంగ్రెస్ నేతలు కౌంటర్లు ఇస్తున్నారు. ఒక్క కుటుంబమే బాగుపడిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా చేశారు మండి పడుతున్నారు. తెలంగాణకు కేసీఆర్ మోసం చేశారు కాబట్టే ఫాంహౌజ్ కు జనం పరిమితం చేశారన్నారు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్. విపక్ష నేతగా సాలరీ తీసుకుంటున్నారు కానీ అసెంబ్లీకి హాజరు కావడం లేదన్న వాదనను కాంగ్రెస్ నేతలు వినిపిస్తున్నారు. టెక్నికల్ గా అటెండెన్స్ వేసుకుని వెళ్తున్నారని క్వశ్చన్ చేస్తున్నారు. కేసీఆర్ ఇక యాక్టివ్ అయ్యే పరిస్థితి లేదంటున్నారు.




# ప్లాన్ బీ

**(మొదటి పేజీ తరువాయి)**

రాలేదు. దాంతో మరోసారి కేబినెట్ ద్వారా సిఫారసు చేయాలని అనుకుంటున్నారు.కేబినెట్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న మహ్మద్ అజారుద్దీన్‌కు ఇప్పుడు సమయం చాలా తక్కువగా ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం, మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలల్లోపు శాసనసభ లేదా శాసనమండలిలో సభ్యత్వం పొందాల్సి ఉంటుంది. అజహర్ విషయంలో ఆ గడువు ఏప్రిల్ 30, 2026తో ముగియనుంది. అంటే పది రోజులు కూడా గడువు లేదు. ఎమ్మెల్సీగా ఖరారు కాకపోతే, మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇది కేవలం అజహర్ వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, రేవంత్ రెడ్డి ప్రతిష్టకు కూడా ఒక సవాల్‌గా మారింది.

**గవర్నర్‌తో భేటీ - రేవంత్ రెడ్డి వ్యూహం**

ఈ అంశంపై కొంతకాలంగా లోక్‌భవన్‌కు, ప్రభుత్వానికి మధ్య ఉన్న ప్రతిష్ఠంభనను తొలగించేందుకు రేవంత్ రెడ్డి సయోధ్య మార్గాన్ని ఎంచుకున్నారు. గవర్నర్‌తో జరిగిన భేటీలో ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ ఉద్యమ ప్రస్థానాన్ని, అజారుద్దీన్ విషయంలో ఉన్న రాజ్యాంగపరమైన అత్యవసర పరిస్థితిని సీఎం వివరించినట్లు తెలుస్తోంది. గతంలో గవర్నర్ కోటా నామినేషన్లపై కోర్టు కేసులు, సాంకేతిక అడ్డంకులు ఉన్నాయని.. ఇప్పుడు సుప్రీంకోర్టు నుండి కూడా సానుకూల సంకేతాలు ఉన్నాయని గవర్నర్‌కు తెలియజేశారు. రాజ్‌భవన్‌తో ఘర్షణ కంటే చర్చల ద్వారానే పనులు పూర్తి చేసుకోవాలనేది రేవంత్ మార్క్ వ్యూహంగా కనిపిస్తోంది.

**మళ్లీ కేబినెట్ ద్వారా సిఫారసు చేసేందుకు రెడీ**

గతంలో సిఫారసు చేసినప్పుడు ప్రస్తుత గవర్నర్ లేరు. పాత గవర్నర్ ఉన్నప్పుడు కేబినెట్ చేసిన సిఫారసులు కొత్త గవర్నర్ ఆమోదిస్తారో లేదో క్లారిటీ లేదు. అందుకే సీఎం రేవంత్ మళ్లీ కేబినెట్ భేటీ ఏర్పాటు చేసి.. మరోసారి సిఫారసు చేయాలని అనుకుంటున్నారు. అప్పుడు గవర్నర్ నిర్ణయం తీసుకుంటారని అనుకుంటున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో మైనారిటీ నేతగా అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం ద్వారా రేవంత్ రెడ్డి ఒక పెద్ద రాజకీయ సందేశాన్ని ఇచ్చారు. ఇప్పుడు ఆయన పదవిని కాపాడలేకపోతే, అది ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం నాయకత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

**ప్లాన్ బీ ఉందా?**

గవర్నర్ క్లియరెన్స్ రాకపోతే ప్లాన్–బి గా అజహర్‌ను మరోసారి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించడం లేదా హైకోర్టును ఆశ్రయించడం వంటి ఇతర ప్రత్యామ్నాయాలను కూడా ప్రభుత్వం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. అయితే, గవర్నర్ ఈ వారంలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటారని రేవంత్ ధీమాగా ఉన్నారు. ఈ వారం ముగిసేలోపు ఎమ్మెల్సీ మీద స్పష్టత వస్తే రేవంత్ రెడ్డి రాజకీయంగా మరో విజయం సాధించినట్లవుతుంది. ఒకవేళ జాప్యం జరిగితే, ఏప్రిల్ 30 లోపు అజహర్ రాజీనామా చేయాల్సి రావడం ప్రతిపక్షాలకు ఒక బలమైన అస్త్రంగా మారుతుంది. అజహర్ మంత్రి పదవిని కాపాడటం ద్వారా తన పట్టును నిరూపించుకోవాలని చూస్తున్న రేవంత్ రెడ్డి, గవర్నర్ కోటా ఫైల్ పై సంతకం చేయించడంలో ఎంతవరకు సఫలమవుతారో చూడాలి.

**అటు ఏఐసీసీ**

అజారుద్దీన్ కోసం అటు ఏఐసీసీ నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికే కీలక నేత ప్రియాంక నుంచి ఒత్తిడి వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో రాహుల్ గాంధీ కూడా ఎంటరైనట్లు సమాచారం. కచ్చితంగా ఈ వారంలో అజారుద్దీన్ పదవిపై ఏదో తేల్చాల్సిన అవసరం రేవంత్ కు అనివార్యంగా మారింది.

# ఆర్టీసీలో సమ్మె సైరన్

**(మొదటి పేజీ తరువాయి)**

మీడియాతో మాట్లాడారు. నేటి నుంచి సమ్మె చేపడుతున్నామని.. సమ్మెకు అన్ని సంఘాలూ మద్దతు తెలిపాయని అన్నారు. ఇప్పటివరకూ ఆర్టీసీ అధికారులు, ప్రభుత్వం తమను చర్చలకు పిలవలేదన్నారు. కనీసం సమ్మె నివారణ చర్యలు కూడా చేపట్టలేదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేయాలని అడుగుతున్నా.. పట్టించుకోలేదని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పెట్టి మరీ ప్రభుత్వం విస్మరించిందని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ అన్నారు. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేయాల్సి వస్తోందని వెంకన్న చెప్పారు. ఈవీ బస్సులు తెస్తూ హైదరాబాద్ డిపోల్లో ఉన్న ఉద్యోగులను జిల్లాలకు పంపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం.. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్ర చేస్తోందన్నారు. కార్మికులను ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తోందని చెప్పారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వేసిన కమిటీపై మీకేం సంబంధం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాలయాపన కోసమే కమిటీ అంటున్నారని విరుచుకుపడ్డారు. మెట్రో రైల్ వ్యవస్థను వెంటనే విలీనం చేశారని... కానీ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి ఎందుకు ఇబ్బందని ప్రశ్నించారు. ప్రభుత్వం చర్చలకు పిలిస్తే జేఏసీ సిద్ధంగా ఉందని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న స్పష్టం చేశారు.

కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 60 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీపై ఆధారపడి ప్రయాణాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా మహాలక్ష్మి పథకం ద్వారా నిత్యం 35 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందుతున్నారు. సమ్మె గనుక జరిగితే సామాన్య ప్రజలు, ముఖ్యంగా మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. 10 వేల బస్సులు డిపోలకే పరిమితమైతే రవాణా వ్యవస్థ స్తంభించిపోతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ సకాలంలో స్పందించి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.

## కేసీఆర్ తిన్న రూ. లక్ష కోట్లు
# ఎప్పుడు కక్కిస్తారు?
### సీఎం రేవంత్ రెడ్డి కు మెదక్ ఎంపి రఘునందన్ రావు నిలదీత
### కేసీఆర్, రేవంత్ ఒకరినొకరు కాపాడుకుంటున్నారు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఈ నెల 29న జరిగిన కాంగ్రెస్, బీఆర్ఎస్ సభల్లో సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ఇద్దరూ తుపాకీ రాముడు మాటలే మాట్లాడారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ బంధం వీణావాణి లాంటిదన్నారు. పైకి వేర్వేరుగా కనిపిస్తున్నా ఈ రెండు పార్టీలు ఒక్కటేనన్నారు. కేసీఆర్, రేవంత్ ఒకరినొకరు కాపాడుకుంటున్నారని ఆరోపించారు. మంగళవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ప్రధాని మోడీ తెలంగాణ వస్తే బీఆర్ఎస్ ఫుల్ పేజీ యాడ్స్ ఇచ్చి బీజేపీ వా ర్తలు రాకుండా చేసిందన్నారు. ఇప్పుడు అదే విద్యను రేవంత్ రెడ్డి ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. ఇద్దరూ ఒకేరోజు సభలు పెట్టి చెరో సగం పేజీ వార్తలు వచ్చేలాగా డ్రామాలు చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సర్కారు చేసిన రూ. లక్ష కోట్ల అవినీతి ని కక్కిస్తాం అని రేవంత్ రెడ్డి రాహుల్ చేత చెప్పిచ్చారని ఇప్పుడు ఎక్కడికిపోయారని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఒక నివేదిక మీద కాకుండా కాళేశ్వరం అనుమతుల నుంచి ఇప్పటి వరకు అన్నింటిపై సీబీఐకి అప్పగించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డిని కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన కంపెనీ మేనేజ్ చేస్తోందన్నారు, ఈ కంపెనీకే మూసీ పనులు కూడా అప్పగిస్తున్నారని ఆరోపించారు. జగిత్యాల నుంచే తమ జైత్ర యాత్ర ప్రారంభం కాబోతోందన్న బీఆర్ఎస్ వ్యాఖ్య లకు రఘునందన్ కౌంటర్ ఇచ్చారు. గతంలో జగిత్యాల జైత్రయాత్ర చేసిన నక్సలైట్లు ఆపై మావోయిస్టులుగా మారి ఇప్పుడు కనుమరుగైపోయారని చెప్పారు. టీఆర్ఎస్ నుం చి బీఆర్ఎస్‌గా మారిందని జలదృశ్యం నుంచి ఆ పార్టీ అదృశ్యం అవుతున్నదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో అవినీతి జరిగిందని కేసీఆర్ బిడ్డ స్వయంగా చెప్పిందని కవితని అప్రూవర్ గా మార్చి వాళ్ళను అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. బూతులు బంజేసి.. ప్రజల కోసం పని చేయ్యండని పిలుపునిచ్చారు.



**అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు:**

కేసీఆర్, రేవంత్ పాలన పుణ్యమా అని తెలంగాణలో ఫసల్ బీమా రైతులు అల్లల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ పార్లమెంట్‌లో మూడు మండలాల్లో అకాల వర్షాలకు ఒక్క వడ్ల గింజ మిగల లేదన్నారు. చేగుంట, నార్సింగి, మాసాయిపేట 3 మండలాలలో ఏడు గ్రామాల రైతులు ఏడుస్తున్నారన్నారు. 6 వేల ఎకరాలకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదు అంటారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
22.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



సైకిల్ చరిత్ర: ప్రారంభ సైకిళ్లలో పెడల్స్ లేక-పోవడం వల్ల ప్రయాణం కష్టంగా ఉండేది. అయి-నప్పటికీ అది వ్యక్తిగత రవాణాలో ఒక విప్లవాత్మక ఆలోచనగా నిలిచింది.



# నాలుగు వారాల్లో కమిటీ

- ఆర్టీసీ సమస్యలపై ప్రభుత్వం కీలక నిర్ణయం
- సమ్మెలు లేకుండా పరిష్కారం దిశగా సంకేతాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్



**ముద్ర, కరీంనగర్ :**

తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) ఉద్యోగులు లేవనెత్తిన వివిధ సమస్యలను పరిశీలించేందుకు అధికారుల కమిటీని ఏర్పాటు చేస్తూ జీఓఎంఎస్ నంబర్ 66ను ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యోగుల సేవా నిబంధనలు, వేతనాలు, ఇతర ప్రయోజనాలపై ప్రభుత్వం వద్దకు వచ్చిన వినతులను సమగ్రంగా పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కమిటీకి రవాణా, రహదారులు అండ్ భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కార్మిక, ఉపాధి, శిక్షణ అండ్ కర్మాగారాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. టీజీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సభ్యుడుకన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ కమిటీ అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నాలుగు వారాల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. సమ్మెలు, ఆందోళనల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోజూ సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద ప్రజలు ఆర్టీసీ బస్సులపై ఆధారపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పేదలకు బస్సు ప్రయాణం జీవనాధారమని, అందువల్ల సేవలు అంతరాయం కలగకుండా చూడటం ప్రభుత్వం, ఉద్యోగుల బాధ్యత అని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యలను అధికారుల కమిటీ ముందుకు తీసుకురావాలని, కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్చలు జరిపి తగిన పరిష్కారాలు అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణతో పాటు ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌలభ్యం అన్నింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు.


# మేం చేతులు కట్టుకుని లేము..

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న తమ ప్రభుత్వాన్ని కేసీఆర్ గద్దె దించాలని అంటే.. తామేమీ చేతులు కట్టుకుని కూర్చోలేదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడు అధికార పక్షానికి సూచనలు ఇవ్వాలే తప్ప విమర్శలకు మాత్రమే పరిమితం అయితే ఎలా అని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ పిల్లి శాపనార్థాలకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు ఎన్నుకుంటేనే తాము అధికారంలోకి వచ్చామని స్పష్టం చేశారు. ఎవరి దయాదాక్షిణ్యాలతో తాము అధికారంలోకి రాలేదన్నారు. మరో 10 ఏళ్ల పాటు తెలంగాణలో తామే అధికారంలో ఉంటామని మంత్రి పొన్నం ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో చేరిన జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ 14 సార్లు బీ ఫామ్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తమ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ అంతాన్ని కేసీఆర్ చూడాలి

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



**ముద్ర, నిజామాబాద్:**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చావును ఎవరూ కోరుకోవడం లేదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చెప్పారు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కానీ బీఆర్ఎస్ పార్టీ అంతాన్ని కేసీఆర్ తన కళ్లారా చూడాలని కోరుకుంటున్నట్లు వివరించారు. అది త్వరలోనే జరుగుతుందని నమ్ముతున్నాను అని సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నిజామాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌ను కేటీఆర్, కవితలే ఎక్కువగా హింసిస్తున్నారని ఆరోపించారు. కవిత, కేటీఆర్‌లకు ఫ్లైట్ టికెట్ ఇచ్చి పంపిస్తే కేసీఆర్ దరిద్రంతో తెలంగాణ దరిద్రం కూడా వదులుతుందని విమర్శలు గుప్పించారు. అటు కాంగ్రెస్ ప్రభుత్వంపైనా విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అర్వింద్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల్లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని, రైతుల గోడును పట్టించుకునే వారే కరువయ్యారని మండిపడ్డారు. ఈ సందర్భంగా పసుపు రైతులకు ఎంపీ అర్వింద్ కీలక హామీ ఇచ్చారు. తాను రాజకీయాల నుంచి తప్పుకునే లోపు పసుపు పంటకు క్వింటాల్‌కు రూ.30 వేల మద్దతు ధర కల్పించి తీరుతాను అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# కేసీఆర్ కుటుంబమే బాగుపడింది

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ముద్ర, వరంగల్:**

గత పదేళ్లలో తెలంగాణలో ఒకే ఒక్క కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకున్న కల్వకుంట్ల కుటుంబం రూ.వేల కోట్లు సంపాదించుకుందని ఆరోపించారు. ప్రజల సొమ్ముతో ఆ కుటుంబం ఆస్తులు పెంచుకుంటే, తెలంగాణ ప్రజల నెత్తిన మాత్రం రూ.వేల కోట్ల అప్పులు మిగిల్చారని మండిపడ్డారు. మంగళవారం వరంగల్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వస్తే అందరి జీవితాలు మారుతాయని ప్రజలు ఆశించారన్నారు. కానీ బాగుపడింది కేసీఆర్ కుటుంబమే అన్నారు. వేలాది అమరులైతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందనే విషయాన్ని గుర్తు చేశారు. తాను తన రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ చిన్న తప్పు కూడా చేయలేదని కడియం స్పష్టం చేశారు. ఎక్కడా అవినీతికి పాల్పడలేదని అన్నారు. ఒకవేళ అవినీతి చేసినట్లుగా ఎవరైనా ఆధారాలతో నిరూపిస్తే, క్షణం కూడా ఆలోచించకుండా వెంటనే తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. నిబద్ధతతో పనిచేసే తనపై అసత్య ఆరోపణలు చేయడం ఇప్పటికైనా మానుకోవాలని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

# రేవంత్ రాహువు.. కేసీఆర్ కేతువు

- లక్ష కోట్ల అవినీతిపై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదు
- తేజస్వీ వ్యాఖ్యలను కాంగ్రెస్, బీఆర్ఎస్ వక్రీకరించాయి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**ముద్ర, కరీంనగర్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాహువు అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేతువు అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అభివర్ణించారు. నువ్వు చావాలంటే నువ్వు చావాలంటూ ఒకరికొకరు పైకి తిట్టుకుంటూ ఇద్దరూ కలిసి తెలంగాణ ప్రజలను చంపుకుతింటున్నారని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతిని కప్పిపుచ్చేందుకు రేవంత్ రెడ్డి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని గత ఎన్నికల్లో చెప్పిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రూ.లక్ష కోట్ల కాళేశ్వరం నిర్మాణంపై విచారణ ఎందుకు జరపడం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి మాత్రం కేసీఆర్ ను కాపాడాలనే ఉద్దేశంతోనే డిజైన్ లోపాలతో నిర్మించిన మేడగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలపై మాత్రమే సీబీఐ విచారణ కోరుతున్నారని చెప్పారు. మంగళవారం కరీంనగర్ లోని రేకుర్తి చెరువు సుందరీకరణ పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు గుగ్గిళ్ల రమేశ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి తదితరులతో మీడియాతో రేవంత్ రెడ్డి, కేసీఆర్ లపై నిప్పులు చెరిగారు. కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధిలో భాగంగా అమ్రుత్ 2 పథకంలో భాగంగా 3 చెరువుల పునరుజ్జీవం కోసం రూ. 5 కోట్ల 82 లక్షల నిధులను కేంద్రం మంజూరు చేసిందని అన్నారు. దీనిలో భాగంగా 1 కోటి 98 లక్షల రూపాయలతో ఈరోజు రేకుర్తి చెరువు పునరుజ్జీవ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా కరీంనగర్ లో గుంతలు పడ్డ అన్ని గల్లీల్లో రోడ్లను నిర్మిస్తామన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరినొకరు తిట్టుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ తో బీజేపీ పొత్తే ఉండదని, పొత్తు పెట్టుకున్న చరిత్ర కాంగ్రెస్ దే అని అన్నారు. తన సీటు ఖాళీ అవుతుందనే భయంతోనే రేవంత్ రెడ్డి ఏకంగా రాహుల్ గాంధీ సీటుకు ఎసరు పెట్టారని అన్నారు. తెలంగాణలో బీజేపీ గెలిచే అవకాశాల్లేవని జీవన్ రెడ్డి అన్నంత మాత్రాన నిజం కాబోదని, ఆ మాటకొస్తే నిజామాబాద్ లో ఎవరు గెలిచారో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. తేజస్వీ సూర్య వ్యాఖ్యలను కాంగ్రెస్, బీఆర్ఎస్ వక్రీకరించాయని, తెలంగాణ ఉద్యమకారులను దేశ భక్తులతో పోల్చితే అది తప్పుగా ఎలా అనిపించిందని అన్నారు. ఈ విషయాన్ని వక్రీకరించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# టీవీజేఏ పనితీరు అభినందనీయం

- మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

**ముద్ర, హైదరాబాద్:**



వీడియో జర్నలిస్టుల సంక్షేమం కోసం, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రెండు రోజుల క్రితం జరిగిన టివిజెఏ కార్యవర్గ ఎన్నికల్లో గెలుపొందిన ఆఫీస్ బేరర్లకు శ్రీనివాస్ రెడ్డి చేతులమీదుగా గెలుపు పత్రాలను మంగళవారం నాడు బషీర్ బాగ్ లోని దేశోద్ధారక భవన్ లో అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.., రాష్ట్రంలోని ఆయా న్యూస్ ఛానెల్స్ లో పని చేస్తున్న వందలాది వీడియో జర్నలిస్టులను ఏకం చేసి, అసోసియేషన్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. వీడియో జర్నలిస్టుల సంక్షేమం కోసం తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. మీడియా రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, వీడియో జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు వృత్తి గౌరవాన్ని పెంపొందించడానికి మీడియా అకాడమీ చర్యలు చేపడుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ మాట్లాడుతూ.., 740మంది సభ్యులతో కొనసాగుతున్న వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ తమ సంఘానికి అనుబంధంగా పనిచేయడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. ఇంతమంది వీడియో జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ అసోసియేషన్, దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆయా కమిటీల్లో వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ కు ప్రాతినిధ్యం దక్కేలా తాము కృషి చేస్తున్నట్లు విరాహత్ అలీ స్పష్టం చేసారు. అలాగే ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల మంజూరీ కోసం టీయుడబ్ల్యూజే కృషి చేస్తుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మోహన్ రాజ్ పిల్లయ్, తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, టివిజెఏ తాజా మాజీ అధ్యక్షుడు, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు వనం నాగరాజు, అసోసియేషన్ నూతన అధ్యక్షుడు హరీష్ నందూరి, ఉపాధ్యక్షుడు పి. ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.సన్నీ, సహాయ కార్యదర్శి వి.జనార్దన్ రెడ్డి, కోశాధికారి ఆర్. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, టీయుడబ్ల్యూజే అధ్యక్షులు విరాహత్ అలీలు సత్కరించారు.



# ఇండి కూటమికి 'జార్జ్ సోరోస్' ఆశీస్సులు

- బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్ రావు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఇండి కూటమికి, ఆ అర్బన్ నక్సల్స్‌కు అంతర్జాతీయ పెట్టుబడిదారుడు జార్జ్ సోరోస్ ఆశీస్సులు ఉన్నాయని బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. వారంతా కలిసి దేశంలో అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగంలో ఎన్నికల నియమావళిని ఎక్కడా ఉల్లంఘించలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని తన ప్రసంగంలో ఎక్కడా ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేయలేదని తెలిపారు. కేవలం కొన్ని రాజకీయ పార్టీలు మహిళలకు చేసిన అన్యాయాన్ని, దేశానికి జరుగుతున్న వంచనను ప్రజలకు వివరించారని ఇందులో తప్పేముందని రాంచందర్ రావు ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండి' కూటమి చేస్తున్న మోసపూరిత రాజకీయాలను ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగం ద్వారా దేశ ప్రజల ముందు ఉంచారని రామచందర్ రావు అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్, ఇండి కూటమికి కొన్ని దుష్టశక్తుల మద్దతు ఉందని చెప్పారు. అందులో కొందరు 'అర్బన్ నక్సల్స్' కూడా ఉన్నారని ఆయన ఆరోపించారు.

# రూ. 2.50 కోట్ల విలువైన హాష్ ఆయిల్ స్వాధీనం

**ముద్ర, వరంగల్:**

వరంగల్ నగరంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ ఎత్తున హాష్ ఆయిల్ తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను డ్రగ్ కంట్రోల్ పార్టీ, స్థానిక పోలీసులు మంగళవారం సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు రూ.2.50 కోట్ల విలువైన హాష్ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన నలుగురు నిందితులు ఒడిశా రాష్ట్రానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ఒడిశాకు చెందిన హంటల్ సన్ను(23), హంటల్ సన్యాసి(23), కండెల చిన్నబాబు (56), కృష్ణా హంటల్ (56) గంజాయి మొక్కల నుంచి సుమారు 40 కిలోల హాష్ ఆయిల్ సేకరించారు. ఇటీవల ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో హాష్ ఆయిల్‌ను తయారు చేసి విక్రయించడం ప్రారంభించారు. తయారు చేసిన ఈ నిషిద్ధ ద్రవ్యాన్ని 5 కిలోల చొప్పున ప్యాక్ చేసి, ముంబైకి తరలించి.. భారీ ధరలకు విక్రయించాలని ప్లాన్ చేశారు. ఈ క్రమంలో వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపిస్తున్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులపై ఎన్.డి.పి.ఎస్, చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నగరంలో డ్రగ్స్ సరఫరా చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.



# కేసీఆర్ చావును ఎవరు కోరుకోలేదు..

- మాజీ ముఖ్యమంత్రిగా ఆయనకు గౌరవం ఇచ్చాం
- అసెంబ్లీకి వచ్చి అన్ని అంశాలపై చర్చించాలి
- రేవంత్ రెడ్డి సర్కార్ ఎందుకు పోవాలి?
- కరీంనగర్ మీడియా సమావేశంలో మంత్రి అడ్లూరి

**ముద్ర, కరీంనగర్:**



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చావును ఎవరు కోరుకోలేదని కేసీఆర్ గౌరవం ఇచ్చి తెలంగాణలో ఏర్పాడిన ప్రజా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని అనేక సందర్భాల్లో విజ్ఞప్తి చేయడం జరిగిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం కరీంనగర్ లోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ జగిత్యాల సభలో మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అనేక సంవత్సరాలుగా పోరాటం చేసిన ఎస్సీ వర్గీకరణ బిల్లు సందర్భంగా అసెంబ్లీకి వచ్చి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరినప్పుడు అసెంబ్లీకి రాలేదని అన్నారు. బీసీలకు 42 శాతం బిల్లు విషయంలో అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని ఆహ్వానించినా రాలేదని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రైతుబంధు నిధులు టింగు టింగుమని పడ్డాయని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారని 2023లో చివరి రైతుబంధు వేసినప్పుడు హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు ను అగ్గువకు కుదువబట్టి రైతుబంధు డబ్బులు జమ చేశారని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో చేసిన అప్పులకు ప్రతినెల రూ. 6వేల కోట్లు వడ్డీలు చెల్లిస్తున్నామని మంత్రి తెలిపారు. రేవంత్ రెడ్డి సర్కారు పోవాలని అంటున్నారని ఎందుకు పోవాలని మంత్రి ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు వంటి అనేక పథకాలను అమలు చేయడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నాలుగు గ్యారంటీలు అమలు చేస్తుందని ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం పోవాలని ఎందుకు కోరుకుంటున్నారని మంత్రి ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు పై జగిత్యాల సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి లక్ష్మణ్ కుమార్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో తరుగు, తప్ప, తాలు పేరుతో తూకంలో కోతలు విధించేవారని, ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. కాళేశ్వరం కేసు విషయం సీబీఐకి అప్పగిస్తే కేంద్రం స్పందించడం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ ఈ విషయంలో చొరవ తీసుకొని సీబీఐ విచారణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూడా చైర్మన్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
22.04.2026 బుధవారం, హైదరాబాద్



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ 'ముద్ర' వేయండి
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# యవ్వనాన్ని హరించే 5 తప్పులు

చిన్న వయసులోనే ముసలితనం



**కాలం మారుతున్న కొద్దీ వయసు పెరిగిపోతుంది. ఇప్పుడున్న వయసు మారిపోయిన తర్వాత తిరిగి రమ్మంటే రాదు. అందుకే ప్రపంచంలో అత్యంత విలువైనది కాలం అని అంటుంటారు. అయితే వయసులో అత్యంత ప్రధానమైనది యవ్వనం, మధ్యస్థం. ఈ వయసులోనే చేయాల్సిన పనులన్నీ చేయాలి. ఆ తర్వాత ఆరోగ్య సమస్యలు, ఇతర సమస్యలు ఉండడంతో కొన్ని పనులు చేయడానికి శరీరం సహకరించదు. అయితే నేటి కాలంలో చిన్న వయసులోనే చాలామంది వృద్ధులుగా మారిపోతున్నారు. యవ్వనం, మధ్యస్థ వయసులో ఉన్నవారే కొన్ని పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఇలా మీరు చిన్న వయసులోనే ముసలి వాళ్లుగా మారిపోవడానికి వైద్యులు చెబుతున్న ప్రకారం ఐదు కారణాలు కారణాలు ఉన్నాయి. అవి ఏంటో ఇప్పుడు చూద్దాం..**

**నీరు తాగకపోవడం:**
ఉద్యోగం, వ్యాపారం కారణంగా చాలామంది బిజీ వాతావరణం లో గడుపుతున్నారు. దీంతో ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు. కొందరు వైద్య పరిశోధకులు చెబుతున్న విషయం ఏంటంటే.. శరీరానికి కావాల్సిన లలనీటిని తీసుకోవడానికి కూడా శ్రద్ధ ఉంచడం లేదు. అయితే డాక్టర్ నటాలియా చెబుతున్న ప్రకారం మనం ప్రతిరోజు సరైన నీరు తీసుకోకపోవడం వల్ల శరీరంలో సోడియం పెరుగుతుంది. దీంతో శరీరంలోని మృత కణాలు తగ్గిపోయి వయసు పెరిగినట్లు అవుతుంది. ఫలితంగా



చిన్న వయసులోనే ఏజ్ బార్ అయినట్లు కనిపిస్తుంది.

**ఒకే చోట కూర్చోవడం:**
నేటి కాలంలో చాలామంది ఒకే చోట కూర్చొని పనిచేస్తున్నారు. శారీరక శ్రమ తగ్గిపోవడంతో శరీరానికి కావాల్సిన వ్యాయామం ఉండడం లేదు. దీంతో డిఎన్ఏ చివరి క్యాప్ పైన టెలిమోర్ ఉంటుంది. ఒకే చోట ఎక్కువసేపు కూర్చోవడం వల్ల ఇది అరిగిపోతుంది. దీంతో వయసు తొందరగా పెరిగే అవకాశం ఉంటుంది.



**సరైన నిద్ర లేకపోవడం:**
ఒత్తిడి, సమస్యల కారణంగా తక్కువగా నిద్రపోయే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. మరికొందరు రకరకాల అలవాట్లతో సరైన నిద్రపోవడం లేదు. UCLA పరిశోధన ప్రకారం.. సరైన నిద్ర లేకపోవడం వల్ల.. లేదా ఆలస్యంగా నిద్రపోయిన..సెల్స్ Aging తొందరగా పెరుగుతుంది. దీంతో చిన్న వయసులోనే పెద్దవారిగా కనిపిస్తారు.



**మనుషుల మధ్య కమ్యూనికేషన్స్ లోపించడం:**
కుటుంబ సభ్యులు, స్నేహితులు, తోటి ఉద్యోగులతో ఎక్కువగా మాట్లాడక పోవడం.. సైలెంట్ గా ఉండడం వల్ల మొహంపై గీతలు.. ముడతలు వచ్చే అవకాశం ఉందని వైద్యుల పరిశోధన ప్రకారం తెలుస్తుంది.



**అనవసరపు కామెంట్స్ చేయడం..**
**ఎక్కువగా వాదించడం:**
అవసరపు విషయాలపై కామెంట్స్ చేయడం.. గట్టిగా అరవడం వల్ల కూడా వాళ్ల వయసు తొందరగా పెరిగిపోయే అవకాశం ఉంటుందని మధ్యలో తెలుపుతున్నారు. మిగతా వారి కంటే వీరిలో ఎక్కువగా డిఎన్ఏ దెబ్బతింటుంది. సెల్ఫ్ రికవరీ ఫాస్ట్గా అవుతూ ఏజ్ పెరిగిపోతుంది. ఈ విధంగా మనం చేసే కొన్ని అలవాట్లతోనే చిన్నవయసులోనే పెద్దవారీగా కనిపిస్తున్నారు. అందువల్ల రోజువారి చేసే పనులతో పాటు ఆరోగ్యం పై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు తెలుపుతున్నారు.



# నయా వలసవాదం: డేటా యుగంలో ఆధిపత్య రాజకీయాలు

చరిత్రను వెనక్కి తిప్పి తే వలసవాదం ఒక స్పష్టమైన రూపంతో కనిపిస్తుంది—భూభాగాల ఆక్రమణ, వనరుల దోపిడీ, స్థానిక సంస్కృతుల అణచివేత, భాషావిలువల రుద్దింపు. ఇది కేవలం రాజకీయ ఆధిపత్యం మాత్రమే కాదు; సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక వ్యవస్థలను పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకునే ప్రయత్నం. విభజించి పాలించే వ్యూహం ద్వారా సమాజాల్లో చిచ్చు పెట్టి, నిరంతర అస్థిరతను సృష్టించడం వలసవాద శక్తుల ప్రధాన ఆయుధంగా ఉండేది.

రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచ రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చాయి. పాత సామ్రాజ్యాలు బలహీనపడ్డాయి. స్వాతంత్ర్య ఉద్యమాలు ఊపందుకున్నాయి. అనేక దేశాలు రాజకీయ స్వేచ్ఛను సాధించాయి. కానీ ఆ స్వేచ్ఛ నిజమైన స్వావలంబనగా మారిందా? లేక అది ఒక కొత్త ఆధిపత్యానికి వేదికగా మారిందా? ఈ ప్రశ్నకు సమాధానం నేటి అంతర్జాతీయ వ్యవస్థలో దాగి ఉంది.

**ప్రత్యక్ష పాలన నుంచి పరోక్ష నియంత్రణకు మార్పు**
ఇప్పటి నయా వలసవాదం ప్రత్యక్ష ఆక్రమణను ఆశ్రయించదు. బదులుగా, పరోక్ష నియంత్రణను వ్యవస్థీకృతంగా అమలు చేస్తుంది. స్వతంత్ర ప్రభుత్వాలే ఉన్నా, వాటి నిర్ణయాలు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, బహుళజాతి కంపెనీలు, శక్తివంతమైన దేశాల ప్రభావంలో ఉంటాయి. ఆర్థిక సహాయం, పెట్టుబడులు, అప్పులు—ఇవి అన్నీ సహకారం అనే పేరుతో వస్తాయి; కానీ వాటి వెనుక దాగి ఉండేది నియంత్రణ.

ప్రత్యేకంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు అప్పుల బారిన పడేలా చేసి, ఆర్థిక విధానాలను నిర్దేశించడం ఒక కీలక వ్యూహంగా మారింది. ఆర్థిక సంస్కరణలు, మార్కెట్ స్వేచ్ఛ అనే పేర్లతో ప్రభుత్వాల నిర్ణయాధికారాన్ని క్రమంగా పరిమితం చేస్తూ, బాహ్య ప్రయోజనాలకు అనుగుణంగా మారుస్తున్నారు.

**కార్పొరేట్ శక్తులు: కొత్త యుగపు 'ఏజెంట్లు'**
నేటి ప్రపంచంలో బహుళజాతి సంస్థలు కేవలం వ్యాపార సంస్థలు కాదు; అవి రాజకీయఆర్థిక శక్తి కేంద్రాలు. సహజ వనరులు, డిజిటల్ డేటా, మార్కెట్లపై ఆధిపత్యం సాధించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వాలు ప్రజల అవసరాల కంటే పెట్టుబడిదారుల ప్రయోజనాలను ప్రాధాన్యంగా చూసే పరిస్థితి ఏర్పడుతోంది.


రాజకీయ వ్యవస్థల్లో కూడా ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలు, నాయకులు, విధాన నిర్ణయాలు—ఇవన్నీ నిధుల ప్రవాహాల ద్వారా ప్రభావితం అవుతున్నాయి. ఫలితంగా, ప్రజాస్వామ్యం రూపకల్పనలో ఉన్నా, ఆత్మ కోల్పోయే ప్రమాదం పెరుగుతోంది.

**డాలర్ ఆధిపత్యం మరియు ఆర్థిక నియంత్రణ**
ప్రపంచ కరెన్సీగా డాలర్ స్థిరపడటం కూడా ఒక ముఖ్యమైన సాధనం. అంతర్జాతీయ వాణిజ్యం, రుణ వ్యవస్థలు, పెట్టుబడుల ప్రవాహం...దీనివల్ల అనేక దేశాలు తమ ఆర్థిక విధానాల్లో స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. ఆర్థిక ఆంక్షలు ఒక శక్తివంతమైన ఆయుధంగా మారాయి—యుద్ధం లేకుండానే దేశాలను ఒత్తిడికి గురిచేసే మార్గం ఇది.

**డిజిటల్ యుగంలో డేటా వలసవాదం**
ప్రస్తుతం ప్రపంచం డిజిటల్ విప్లవాన్ని అనుభవిస్తోంది. ఈ నేపథ్యంలో డేటా ఒక కొత్త 'సంపద'గా మారింది. టెక్నాలజీ సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫార్ములు దేశాల ఆర్థిక వ్యవస్థలపై మాత్రమే కాకుండా, ప్రజల ఆలోచనా విధానాలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. సమాచారం నియంత్రణ, అల్గోరిథమ్ ఆధారిత ప్రభావం, సాంస్కృతిక మార్పులు—ఇవి అన్నీ ఒక కొత్త రకం ఆధిపత్యాన్ని సూచిస్తున్నాయి.

డేటా నిల్వ, ప్రాసెసింగ్, సాంకేతిక మౌలిక సదుపాయాల విషయంలో కొద్ది దేశాలపై ఆధారపడటం వల్ల, మిగతా దేశాలు తమ డిజిటల్ స్వావలంబనను కోల్పోతున్నాయి. ఇది భవిష్యత్తులో మరింత తీవ్రమైన సమస్యగా మారే అవకాశముంది.

**భౌగోళిక రాజకీయాలు మరియు ఒత్తిళ్లు**
తమ విధానాలకు లోబడని దేశాలపై ఆర్థిక ఆంక్షలు, వాణిజ్య పరిమితులు, రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో సైనిక జోక్యం కూడా జరుగుతోంది. ఇది ప్ర





పంచాన్ని మళ్లీ విభజనల దిశగా నడిపించే ప్రమాదాన్ని కలిగిస్తోంది.ప్రస్తుతం జరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాలు, సాంకేతిక పోటీ—కేవలం రూపం మాత్రమే మారింది; పోరాటం మాత్రం కొనసాగుతూనే ఉంది.

**ముందున్న సవాళ్లు**
**ఈ పరిస్థితుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ముందున్న సవాళ్లు చాలా పెద్దవి:**
ఆర్థిక స్వావలంబనను సాధించడం
పారదర్శక, బాధ్యతాయుత పాలనను బలోపేతం చేయడం
డిజిటల్ స్వాధీనతను కాపాడుకోవడం
స్థానిక సంస్కృతి, విలువలను పరిరక్షించడం
బహుళజాతి ఒత్తిళ్లకు లోబడకుండా విధాన నిర్ణయాలు తీసుకోవడంఇవి సాధ్యమవ్వాలంటే దేశీయ రాజకీయ చైతన్యం, ప్రజల అప్రమత్తత, అంతర్జాతీయ సహకారం.వలసవాదం గతానికి పరిమితం కాలేదు; అది మారిన రూపంలో వర్తమానాన్ని ప్రభావితం చేస్తోంది. భూభాగాల ఆక్రమణ నుంచి డేటా ఆక్రమణ వరకు వచ్చిన ఈ ప్రయాణం, ఆధిపత్య రాజకీయాల నిరంతరత్వాన్ని చూపుతోంది.

ప్రపంచం నిజమైన సమానత్వం, పరస్పర గౌరవం, స్వతంత్రతను లక్ష్యంగా పెట్టుకుంటే—ఈ నయా వలసవాద ధోరణులను గుర్తించి, సమిష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. లేదంటే, స్వాతంత్ర్యం ఒక భావనగా మాత్రమే మిగిలి, వాస్తవం మాత్రం మరొక రూపంలోని ఆధిపత్యంగా మారిపోతుంది.

రెండవ ప్రపంచ యుద్ధం జరిగే క్రమంలో యుద్ధం ముగిసిన తర్వాత విశ్వవ్యాప్తంగా ఎటువంటి చర్చలు జరిగాయో అంతకుమించిన మేధోమథనం ఇప్పుడు ప్రారంభం కావలసిన అవసరం ఉంది. లేకుంటే ప్రపంచ దేశాల మధ్య నెలకొంటున్న ఈ ఆర్థిక వైరుధ్యాలతో మూడవ ప్రపంచ యుద్ధానికి ఆస్కారమేర్పడుతుంది.. నయా వలస వాద విధానాల రూపం మారకపోతే ప్రపంచ మానవాళికి ముప్పు జరుగుతుంది.




సురేష్ కాలేరు
8688178339, సామాజిక రాజకీయ విశ్లేషకులు

# సమ్మె, సంక్షోభం, సంస్కరణలు.. ఆర్టీసీ భవిష్యత్తు ఎటు?

భారతదేశ సామాజిక ముఖచిత్రంలో ప్రజా రవాణా వ్యవస్థ అక్షరాలా కోట్లాది మంది సామాన్యుల జీవన గమనానికి వెన్నెముక వంటిది. ముఖ్యంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు కేవలం రవాణా సాధనాలు మాత్రమే కావు, అవి గ్రామీణ భారతాన్ని పట్టణ ప్రగతితో అనుసంధానించే జీవనాడులు. నిరుపేదలు, విద్యార్థులు, కార్మికులు, చిన్న వ్యాపారులు తమ దైనందిన అవసరాల కోసం ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడతారు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రతిష్ఠాత్మక సంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, పరిపాలనాపరమైన వైఫల్యాలు, ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వెరసి కార్మిక సమ్మెలకు దారితీస్తున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె అనేది కేవలం వేతనాల పెంపు కోసం జరిగే పోరాటం మాత్రమే కాదు, అది ప్రజా రవాణా వ్యవస్థ మనుగడ కోసం, సామాన్యుడి ప్రయాణ హక్కు కోసం ఉద్భవించిన ఒక పెను సామాజికఆర్థిక ఉద్యమంగా పరిగణించాల్సి ఉంటుంది.

స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో 1950వ దశకంలో ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ సంస్థలు ఆవిర్భవించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ, నవ్యాంధ్ర వరకు ఆర్టీసీ సేవలు అజరామరమైనవి. నాడు లాభసాటిగా సాగిన ఈ ప్రయాణం క్రమంగా నష్టాల బాట పట్టడానికి ప్రధాన కారణం పెరిగిన ఇంధన ధరలు మరియు ప్రభుత్వాల పన్నుల విధానం. డీజిల్ ధరలు లీటరుకు 100 రూపాయలకు పైగా చేరుకుంటున్నా, సామాన్యుడిపై భారం పడకూడదనే ఉద్దేశంతో టికెట్ ధరలను వలసిన విధంగా పెంచకపోవడం సంస్థకు భారంగా మారింది.




దీనికి తోడు ప్రైవేట్ వాహనాల అక్రమ రవాణా వల్ల సంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఆర్టీసీ నిర్వహణలో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ఉచిత పాస్‌లు సంస్థ ఆర్థిక సంక్షోభానికి మరో ప్రధాన కారణం. ఉదాహరణకు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యార్థులు, దివ్యాంగులు, జర్నలిస్టులు, వృద్ధులకు ఇచ్చే రాయితీల భారం ఏటా వందల కోట్లలో ఉంటుంది. ఈ రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం సకాలంలో రీయంబర్స్ చేయక పోవడం వల్ల సంస్థ అప్పుల ఊబిలో కూరుకు పోతోంది. గణాంకాల ప్రకారం, ఒక్క తెలంగాణ ఆర్టీసీపైనే గతంలో సుమారు 5,000 కోట్ల రూపాయలకు పైగా అప్పులు ఉండగా, నెలవారీ నష్టం 50 నుండి 80 కోట్ల రూపాయల వరకు నమోదవుతూ వచ్చింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సంస్థలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సుమారు 48,000 నుండి 50,000 మంది ఉద్యోగులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు కేవలం వాహనాలను నడపడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు బాధ్యత వహిస్తున్నారు. అయితే పని ఒత్తిడి, విశ్రాంతి లేకపోవడం, సరైన వైద్య సౌకర్యాలు అందకపోవడం వంటి అంశాలు వారిని మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాయి. 2019లో తెలంగాణలో జరిగిన చారిత్రాత్మక ఆర్టీసీ సమ్మె ఈ సమస్యల తీవ్రతకు నిలువుటద్దం. 52 రోజుల పాటు సాగిన ఆ సమ్మెలో దాదాపు 50,000 మంది కార్మికులు తమ హక్కుల కోసం వీరోచితంగా పోరాడారు. ఆ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి, దీనివల్ల రోజుకు 10 నుండి 15 కోట్ల రూపాయల ఆదాయం సంస్థ కోల్పోయింది.

సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించడానికి కేవలం సమ్మెలు పరిష్కారం కావు, ప్రభుత్వం మరియు యజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఆర్టీసీని ఒక వ్యాపార సంస్థగా కాకుండా సామాజిక సేవా సంస్థగా చూడాలి. ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఆర్టీసీకి ప్రత్యేక నిధులు కేటాయించడమే కాకుండా, పన్ను రాయితీలు కల్పించాలి. డీజిల్‌పై వాట్ (VAT) తగ్గించడం ద్వారా ఏటా వందల కోట్ల రూపాయల వ్యయాన్ని ఆదా చేయవచ్చు. అలాగే పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ప్రస్తుతం టికెట్ ఆదాయం కాకుండా ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగానే తెలంగాణ ఆర్టీసీ ప్రారంభించిన 'కార్గో మరియు పార్శిల్' సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. రోజుకు సుమారు 50 నుండి 70 లక్షల రూపాయల వరకు అదనపు ఆదాయం ఈ సేవల ద్వారా సమకూరుతోంది.

ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం మరొక కీలక సంస్కరణ. కిలోమీటరుకు డీజిల్ బస్సుతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సు నిర్వహణ ఖర్చు 30% నుండి 40% వరకు తక్కువగా ఉంటుంది. పర్యావరణ హితంగా ఉండటమే కాకుండా ఇంధన భారాన్ని ఇది గణనీయంగా తగ్గిస్తుంది. ఇప్పటికే హైదరాబాద్ వంటి నగరాల్లో వందలాది ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడం శుభపరిణామం. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను చేపట్టింది. ఇది కార్మికుల దశాబ్దాల కాలపు కల. దీనివల్ల సుమారు 43,000 మందికి పైగా కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొంది, ఉద్యోగ భద్రత మరియు సరైన వేతన సవరణ పొందే అవకాశం ఏర్పడింది.

అయితే, సంస్థ స్వయం ప్రతిపత్తిని కాపాడుతూనే ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం సవాలుతో కూడుకున్న పని. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టడం, ప్రయాణికుల కోసం మొబైల్ యాప్‌ల ద్వారా లైవ్ ట్రాకింగ్ సౌకర్యం కల్పించడం వంటి చర్యలు సంస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతాయి. కార్మికులతో యజమాన్యం నిరంతరం చర్చలు జరుపుతూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఒక పటిష్టమైన గ్రీవెన్స్ మెకానిజంను ఏర్పాటు చేయాలి. అప్పుడే సమ్మెల వంటి తీవ్ర నిర్ణయాలకు తావుండదు. ప్రజల అవసరాలు, కార్మికుల సంక్షేమం, ప్రభుత్వ ఆర్థిక స్థిరత్వం ఈ మూడింటి మధ్య సమతుల్యత దెబ్బతిన్నప్పుడే సంక్షోభాలు తలెత్తుతాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు, ఆధునిక సంస్కరణలు మరియు మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తేనే ఆర్టీసీ మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది. భావి తరాలకు భరోసా ఇచ్చేలా, సామాన్యుడి ముంగిట ఎర్ర బస్సు నిరంతరం పరుగులు తీయాలంటే సంకల్పం.. సమష్టి కృషి అనివార్యం. సమ్మెలు తాత్కాలిక సెగను రేపవచ్చు, కానీ చర్చలు..సంస్కరణలు మాత్రమే శాశ్వత వెలుగును నింపుతాయి. ఆర్టీసీ మనుగడ అనేది కేవలం ఒక ఆర్థిక అంశం కాదు, అది లక్షలాది కుటుంబాల జీవనోపాధి మరియు కోట్ల మంది సామాన్యుల కనీస రవాణా హక్కు. వ్యవస్థను ప్రైవేటీకరణ వైపు కాకుండా, ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఆధునీకరించడం ద్వారా మాత్రమే సుస్థిరమైన పురోగతి సాధ్యమవుతుంది. ప్రస్తుత తరుణంలో ఏప్రిల్ 22 నుండి కార్మికులు చేపడుతామని చెపుతున్న సమ్మెను నివారించాలంటే ప్రభుత్వం కార్మికుల సాధ్యాసాధ్యమైన కోర్కెలను సానుకూలంగా పరిశీలించాల్సి ఉంది. ఆర్టీసీని కాపాడుకోవడం అంటే సామాన్యుడి ప్రయాణాన్ని కాపాడుకోవడమే. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా సంస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దడం పాలకుల ప్రాథమిక బాధ్యత. బస్సు చక్రం ఆగిపోతే అభివృద్ధి కుంటుపడుతుంది, అదే చక్రం ప్రగతి పథంలో సాగితే సమాజం అంతా సుభిక్షంగా ఉంటుంది.

అందుకే ఆర్టీసీ భవిష్యత్తు అనేది కేవలం సంస్కరణలపైనే కాక, ప్రభుత్వ చిత్తశుద్ధి మరియు కార్మికుల అంకితభావంపై ఆధారపడి ఉంది. సమగ్ర ప్రణాళికలతో సంస్థను బలోపేతం చేసి, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఆర్టీసీని మళ్ళీ అగ్రగామిగా నిలబెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. పారిశ్రామిక శాంతి నెలకొన్నప్పుడే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయి, సంస్థ కూడా లాభాల బాట పడుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

బుధవారం 22.04.2026

www.mudranews.in | @mudranews



**సైకిల్ చరిత్ర:** 1860లో Pierre Michaux పెడల్స్‌ను ముందు చక్రానికి జోడించి సైకిల్ అభివృద్ధికి కొత్త దిశ ఇచ్చారు. ఇది సైకిల్‌ను మరింత మార్చింది.



## సంక్షిప్తంగా..

### విద్యాధికారికి సన్మానం



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** మహబూబ్‌నగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సి. రమణి ని జిల్లా ప్రైవేట్ జూనియర్ కాలేజీ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం సంఘం నాయకులు సన్మానించారు. ఇంటర్ విద్యలో ప్రైవేట్ కాలేజీ ఉత్తమ విద్యని అందిస్తున్నాయని, విద్యార్థులను ఇంటర్ విద్యతో పాటు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చి విజేతలుగా తీర్చి దిద్దుతున్నామని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రమణిమాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు ప్రైవేట్ కళాశాల లు కృషి చేయాలని సూచించారు.ప్రవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన ఇంటర్ విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ కళాశాలలతో పాటు, ప్రైవేట్ కళాశాలలు ఇంటర్ బోర్డు కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్ గౌడ్( జలజం ),రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జహీర్ అక్తర్, వెంకటరెడ్డి, వెంకటయ్య, మధుమోహన్, వెంకట రాములు,వెంకటేశ్వర్ రెడ్డి , రాఘవేందర్, ప్రైవేట్ కళాశాలల యాజమాన్య సభ్యులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పోస్టర్ విడుదల



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈనెల 22న అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పురస్కరించుకుని ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల మధ్య విద్యార్థులు, యువతకు గద్వాల ప్రాక్టీసింగ్ హై స్కూల్ నుంచి సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు తెలిపారు. సైకిల్ ర్యాలీకి సంబంధించిన గోడ పత్రికలను మంగళవారం తన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాలీ ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, కాలుష్య నియంత్రణలో భాగంగా సైక్లింగ్ వంటి పర్యావరణ హిత మార్గాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అంతకు ముందు గద్వాల ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల వద్ద జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి ఉపాధ్యాయులతో కలిసి గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీసి జిల్లా సమన్వయకర్త శ్రీధర్, ఋషి రాజు పాల్గొన్నారు.

### విద్యార్థికి ఆర్థికసాయం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** కడు పేదరికంలోనూ ఉన్నత చదువులే లక్ష్యంగా ఉత్తమ ర్యాంకు సాధించిన బీఎస్సీ హార్టికల్చర్ విద్యార్థిని అనూషకు దాతలు చేయూతనందించారు. మంగళవారం క్లాస్మేట్ క్లబ్, టీయూ డబ్ల్యూజే ఐజేయూ జర్నలిస్టు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థిని తండ్రి రామస్వామికి నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, శ్యాం ప్రసాద్ లాల్ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహం బహుమతి అందజేశారు. డాక్టర్ ఆకారపు భాస్కర్, వాస రాఘవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.రమణ కుమార్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పోలా శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి కె.పి ప్రసాద్, టీయుడబ్ల్యూజే ఐజేయు అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు పలుస విజయ్ కుమార్, పట్టణ కమిటీ అధ్యక్షులు బొడ్డుపల్లి మల్లేష్, శ్రీనివాస్ యాదవ్, కొండకింది మాధవరెడ్డి, జయప్రసాద్ ఉన్నారు.

# ఉన్నత చదువులతో గొప్ప స్థాయికి చేరుకోవాలి

**సామాజిక రుగ్మతల నివారణకు విద్యార్థులు కృషి చేయాలి**

**సంక్షేమ వారోత్సవాల్లో ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ సురభి**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** చదువుతోనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, విద్యార్థులు చక్కగా చదువుకొని తాము అనుకున్న రంగాల్లో రాణించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ సురభి పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల రెండో రోజు మంగళవారం గద్వాల జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో సంక్షేమ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తోందన్నారు. విద్యార్థి దశలో చక్కగా చదువుకొని మంచి ఫలితాలు సాధిస్తే వారి భావి జీవితమంతా సంతోషంగా ఉంటుందన్నారు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. నృత్య, నాటక



ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను అభినందించారు. బాల్యవివాహాలు వంటి సామాజిక రుగ్మతలను నివారించేందుకు విద్యార్థులు తమ వంతుగా కృషి చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో ఉండే సమస్యల పరిష్కారానికి ఈ వారోత్సవాల సందర్భంగా చేపట్టబోయే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు చేయాలన్నారు. వసతి గృహ విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు, వసతి గృహ వార్డెన్ లు వారం పాటు నిర్వహించే సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు అధికారులతో కలిసి కలెక్టర్ బహుమతులను అందజేశారు. అంతకుముందు పలువురు విద్యార్థులు చేసిన నృత్య, నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్, ఇతర అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వంటగదిని, స్టోర్ రూమ్, తదితర పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, ప్రత్యేక అధికారి నూకరాజు, గద్వాల తహసిలార్ హరికృష్ణ, స్థానిక కౌన్సిలర్ వేదవతి, మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ నాగరాజు, ఇతర అధికారులు, వార్డెన్లు, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**కొనుగోళ్లు ఆలస్యం లేకుండా**

**పారదర్శకంగా నిర్వహించాలి**

**నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్**



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పరిధిలోని దేవదారికుంట తండా వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా సమీక్షించారు. కేంద్రానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారి సమస్యలను తెలుసుకుని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్పందించిన కలెక్టర్, కొనుగోళ్లు ఎటువంటి ఆలస్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.2,400 రైతులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మొక్కజొన్న పంటలో తేమ శాతం 14 శాతం లోపు ఉండేలా సిద్ధం చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. తేమ శాతం అధికంగా ఉంటే ధర తగ్గే అవకాశాలు ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పంట నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.కేంద్రంలో తూకం, నిల్వ, రవాణా వంటి ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యాలు కల్పించాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్ సైదులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సీఈఓ కొమ్ము ఎల్లయ్య, ఆర్ఐ బలరాం, శివ, పీఏసీఎస్ మల్లేష్, రైతులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

### మన్ననూరు పీహెచ్సీ ఆకస్మిక తనిఖీ

ప్రజల ఆరోగ్య సంరక్షణలో ప్రభుత్వ ఆసుపత్రులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని మన్ననూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పనితీరు, వైద్య సేవల అందుబాటు, రోగులకు అందుతున్న సదుపాయాలపై సమగ్రంగా పరిశీలన జరిపారు. ముందుగా డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, సమయ పాలన మరియు విధి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవల నాణ్యతపై అభిప్రాయాలు సేకరించారు. వారు ఎలాంటి సమస్యలతో వచ్చారో, చికిత్స ఎలా అందుతోంది, సంతృప్తి స్థాయి ఎలా ఉందో వివరంగా అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో రోజువారీ అవుట్ పేషెంట్ల (ఓపీ) సంఖ్యపై వివరాలు తెలుసుకొని, ప్రతి రోగి వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయాలని, ఇచ్చే చికిత్స, మందుల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. రికార్డు నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. తదుపరి ల్యాబొరేటరీ, మెడికల్ స్టోర్, లేబర్ రూమ్ వంటి విభాగాలను పరిశీలించి, పరికరాలు, ఔషధాల నిల్వ, పరిశుభ్రత పరిస్థితులను సమీక్షించారు. లేబర్ రూమ్‌లో సదుపాయాలపై విచారించి, గత నెలలో జరిగిన ప్రసవాల వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని తెలిపారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించి, సమయానుకూలంగా చికిత్స అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.ఆసుపత్రి నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు.కలెక్టర్ వెంట ఐటిడిఏ మేనేజర్ జాఫర్ హుస్సేన్, వైద్యులు, ఇతర అధికారులు, గ్రామ సర్పంచ్ ఇస్లావత్ మంజుల రాజారం తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**




**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ సర్కార్ కృషి చేస్తున్నదని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని హన్వాడ మండల కేంద్రం, నాయినోనిపల్లిలో ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొంటామన్నారు. రైతే రాజు అని, రైతుల అభివృద్దే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు తమ పంటలను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. మధ్యవర్తుల మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రైతు సంక్షేమానికి ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర అందించడంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతుల ఆర్థిక భారం తగ్గించేందుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసి ఉపశమనం కల్పించామని తెలిపారు. రైతు బంధు పథకం ద్వారా పెట్టుబడి సహాయం అందిస్తున్నామని, కౌలు రైతుల కోసం ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రైతు సంక్షేమ చర్యలు కీలకమని, ప్రతి రైతు కుటుంబం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా చల్లటి తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గన్నీ బస్తాలు సమృద్ధిగా సిద్ధంగా ఉంచాలని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు సులభంగా తమ ధాన్యం విక్రయించుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత , హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, నవనీత, యాదిరెడ్డి, సర్పంచ్ లు బొట్టు శ్రీను, శ్రీను నాయక్, సుధాకర్, నాయకులు టంకర కృష్ణయ్య యాదవ్, తిరుపతయ్య, షబ్బీర్ హుస్సేన్, మోహన్, క్రిష్ణ,నర్సింహులు, వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

### జనగణన సమర్థవంతంగా నిర్వహించాలి




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జనగణనలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. అచ్చంపేట మండల కేంద్రంలోని ఎంఎస్ఎన్ హైస్కూల్‌లో జరుగుతున్న జనగణన శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో కాగితంపై జనగణన వివరాలు నమోదు చేసేవారని, ప్రస్తుతం 2027 జనగణనను కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇండ్ల వివరాలలు, జనాభా లెక్కలు నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.డిజిటల్ సర్వే సమయంలో పొరపాట్లు జరిగితే వాటిని వెంటనే సరిచేసుకోవాలని ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు సూచించారు. క్షేత్రస్థాయికి వెళ్లే ముందు హౌస్ లిస్టింగ్ బ్లాక్ మ్యాప్ ఆధారంగా పరిధులను ముందుగానే పరిశీలించుకోవాలని తెలిపారు. ప్రతి ప్రశ్నకు సమగ్రంగా సమాధానం నమోదు చేసి సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.శిక్షణ సమయంలో ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని, ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని జిల్లా అభివృద్ధికి దోహదపడేలా జనగణనను కచ్చితంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్ సైదులు, మాస్టర్ ట్రైనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** చంద్రధన్ సబ్ స్టేషన్‌లో సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఫీడర్లను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ ఫీడర్ల ద్వారా రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించి వ్యవసాయ పనులు సులభతరం కానున్నాయి. కల్వకుర్తి నియోజకవర్గంలో మంగళవారం జరిగిన పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తదుపరి, పడకల్ గేట్ సమీపంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పి. అంజిరెడ్డి తన 150వ రక్తదానాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, అంజిరెడ్డి సేవలను అభినందించి, వారి కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఆమనగల్ మండలంలో ఆకుతోటపల్లి గ్రామ పంచాయతీలో సబ్ స్టేషన్‌లో రూ.2.50 కోట్ల వ్యయంతో ఫీడర్ ప్రారంభించగా, ఆమనగల్ పట్టణంలోని సబ్ స్టేషన్‌లో మేడిగడ్డ 11కేవీ ఫీడర్‌ను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో బాలాజీ సింగ్, ఆమనగల్ మార్కెట్ చైర్మన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జగ్గా రెడ్డి, కేశవ రెడ్డి, మెహన్ రెడ్డి, రమాదేవి, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ, రఘురాములు, రమేష్ యాదవ్, శ్రీశైలం, మహేష్, రఘుపతి, రాజెందర్ రెడ్డి, రాజెందర్ నాయక్, రవీంద్ర యాదవ్, అజీమ్, నర్సింహ రెడ్డి, మల్లేష్ యాదవ్, కృష్ణ, చెన్నకేశవులు, రఘుపతి యాదవ్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి



**ముద్ర, హైదరాబాద్:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు వండర్లా వద్ద బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తండ్రి, కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. భార్య , కూతురుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం వనస్థలిపురంకు చెందిన కొమ్మగోని ప్రశాంత్ గౌడ్ (41) విద్యుత్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగి పనిచేస్తున్నాడు. తన భార్య కుమ్మగొని వాణి, కొడుకు శ్రీతన్ (11) కూతురు శశికతో కలిసి తన బైక్‌పై వండర్‌లా నుంచి సర్వీస్ రోడ్డు వెంట వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రశాంత్ గౌడ్ అక్కడికక్కడే మృతి చెందగా. కొడుకు శ్రీతన్ గౌడ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రశాంత్ గౌడ్ భార్య, కూతురు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 22.04.2026
www.mudranews.in | @mudranews



### సైకిల్ చరిత్ర

ఆ కాలంలో వచ్చిన “పెన్నీ-ఫార్థింగ్” సైకిళ్లు పెద్ద ముందు చక్రంతో ప్రత్యేకంగా కనిపించేవి. కానీ అవి ప్రమాదకరంగా ఉండేవి మరియు నియంత్రించడం కష్టం.



# హామీలను మరిచిన ప్రజా ప్రభుత్వం

**- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలని మరిచిపోయిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చేరిన జీవన్ రెడ్డికి హృదయపూర్వక స్వాగతం తెలిపారు. జగిత్యాల సభను సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి కాటారం సభలో చిల్లర మాటలు మాట్లాడారని మండిపడ్డారు. అవి ఒక ముఖ్యమంత్రి మాట్లాడాల్సిన మాటలు కావన్నారు. కేసీఆర్‌ను ఉరితీయాలనడం తగదన్నారు. ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ సాధించినందుకు ఉరితీయాలా అని ప్రశ్నించారు. ఎడారిగా ఉన్న తెలంగాణకు పుష్కలంగా నీళ్లు తెచ్చినందుకు ఉరితీయాలా అని అడిగారు. 80 లక్షల మంది రైతులకు పంట సాయం చేసినందుకా, 24 గంటల కరెంటు ఇచ్చినందుకా? గ్రామాలను అభివృద్ధి చేసినందుకా? ఎందుకు ఉరితీయాలో చెప్పాలని నిలదీశారు. హామీలన్ని చెత్తబుట్టలో వేసిన నిన్ను ఎన్నిసార్లు ఉరితీయాలని ప్రశ్నించారు. రైతులను మోసం చేసిన నిన్ను ఎన్నిసార్లు ఉరితీయాలని నిలదీశారు. ఎన్నికల ముందు రెండు వేల పెన్షన్‌ను నాలుగు వేలు చేస్తానన్నావ్ కదా ఏమైందన్నారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2500 ఇస్తానంటివి.. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానంటివి? వాటిలో ఒక్కటైనా అమలైందా అని ప్రశ్నించారు. సీఎం సీటు కోసం ఎన్నో అబద్ధాలు ఆడారని తెలిపారు.

## తడిసిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలి



**బోథ్, ముద్ర:** అకాల వర్షాల కారణంగా తడిసిన ప్రతీ గింజను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన బోథ్ మండలంలోని ధన్నూర్ గ్రామంలో తడిసిన జొన్న కుప్పలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులతో మాట్లాడి వారికి ధైర్యం కల్పించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతోనే రైతులు నష్టపోతున్నారని తెలిపారు. అకాల వర్షం కారణంగా తడిసిన ప్రతీ గింజను ప్రభుత్వం బేషరతుగా కొనుగోలు చేయాల న్నారు. ఎమ్మెల్యే వెంట బోథ్ మండల మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచ్ లు, పలువురు నాయకులు ఉన్నారు.


## జొన్నల కొనుగోలు కేంద్రాలు పెంచండి



**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలను పెంచాలని కోరుతూ డీసీసీ అధికార ప్రతినిధి పసుల చంటి మంగళవారం జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు చంటి హైదరాబాద్ లో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా తెల్ల జొన్నలు విస్తారంగా సాగు చేయడంతో అంచనాలకు మించి దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలను పెంచాలని కోరారు. మంత్రి వెంటనే స్పందించి జిల్లాలో కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలని కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేసినట్లు చంటి తెలిపారు. ఎకరానికి 20 క్వింటాళ్లు తీసుకునే విషయం ముఖ్యమంత్రితో మాట్లాడుతాని, గతేడాది కంటే ఎక్కువ కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు వినతి**



**బోథ్, ముద్ర:** మండలంలోని కౌఠ (బి) బస్టాండ్ సమీపంలో గల అంతర్ రాష్ట్ర రహదారిపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరుతూ స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ, మహారాష్ట్రాలను అనుసంధానించే ఈ అంతర్ రాష్ట్ర రహదారి గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. ఈ రహదారి పక్కనే ప్రభుత్వ వసతి గృహం, దేవాలయాలు, నివాస ప్రాంతాలు ఉన్నాయని చెప్పారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఈ మార్గంలో పలు మార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ విషయంపై ఇప్పటికే తాము పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని వెంటనే గ్రామంలోని బస్ స్టాండ్ సమీపంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ ఓరుగంటి స్వామి, ఉప సర్పంచ్ రమణారెడ్డి, యూత్ సభ్యులు అరవింద్ కుమార్, ప్రవీణ్, రాజు, ప్రశాంత్, హరిప్రసాద్, అబ్దుల్ రాహుఫ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ విద్యార్థులకు జేఈఈ లో ఉత్తమ ర్యాంకులు




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పట్టణంలోని అల్ఫోర్స్ కాలేజీ విద్యార్థులు జేఈఈ మెయిన్స్ 2వ సెషన్ లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. వివిధ కేటగిరీల్లో ఆల్ ఇండియా స్థాయిలో కాలేజీకి చెందినవర్తిని రెడ్డి 211వ ర్యాంకు, కె. నచికేత్ 593వ ర్యాంకు సాధించారు. వీరిని కళాశాల చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి అభినందించారు.

## చోరీకి గురైన ఫోన్ల అందజేత



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లా వ్యాప్తంగా కొద్ది నెలలుగా చోరీకి గురైన రూ.12 లక్షల విలువైన వంద ఫోన్లను పోలీసులు రికవరీ చేసి సంబంధిత వ్యక్తులకు అందజేశారు. ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలతో పోలీసులు మొబైల్ దొంగతనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సీఈఐఆర్ పోర్టల్ సహకారంతో రికవరీ చేశారు. మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఇప్పటివరకు రూ.2.56 కోట్ల విలువైన ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ సిబ్బందిని ఎస్పీ అభి నందించారు.

# మంచు కొండలపై నృత్యం అద్భుతం

**- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పట్టణంలోని భాగ్యనగర్ కు చెందిన వరణ్య అనే చిన్నారి నాలుగు వేల అడుగుల ఎత్తైన మంచు పర్వతంపై -4 డిగ్రీల సెల్సియస్ లో కూచిపూడి నృత్యం చేయడం అద్భుతమని బీజేఎల్పీ నేత, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం చిన్నారిని అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదిహేను రోజుల క్రితం జమ్మూ కాశ్మీర్ రాష్టం బారాముల జిల్లా గుల్మార్గ్ ప్రాంతంలోని ఆఫర్వాత్ పర్వతంపై శ్రీ విఘ్నరాజం భజే అంటూ కూచిపూడి నృత్యం చేయడం అభినందనీయమని కొనియాడారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి నిర్మల్ కీర్తి ప్రతిష్టను ప్రపంచ దేశాలకు చాటాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఖమ్మం సురేందర్, మాజీ ఎంపీపీ రమేష్, నాయకులు రాజే శ్వర్, జీవన్ రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## విచక్షణ రహితంగా ఎరువులు వాడొద్దు



**ముద్ర, కరీంనగర్:** రైతులు విచక్షణ రహితంగా ఎరువులు వాడవద్దని సుల్తానాబాద్ ఏవో పైడితల్లి సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), రామగిరి ఖిల్లా నుంచి శాస్త్రవేత్త డాక్టర్ పిల్లి కిరణ్ కుమార్‌తో కలిసి ఆమె సుల్తానాబాద్ మండలంలోని చిన్న కల్వల గ్రామంలో రైతుల వద్దకు వెళ్లి మంగళవారం సమగ్ర ఎరువుల యాజమాన్యం, భూసార పరీక్ష ఆధారిత, ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె డాక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. రైతులు తప్పక భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. విచక్షణ రహితంగా పంటలపై ఎరువులు వాడడం ద్వారా పంట పెట్టుబడి పెరగడంతో పాటు భూసారం దెబ్బ తింటుందన్నారు.

రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలి తాల ఆధారంగా సిఫారసు చేసిన ఎరువులను వాడడం ద్వారా పెట్టుబడి తగ్గించుకోవడంతో పాటుగా సూక్ష్మ పోషక లోపాలను అధిగమించవచ్చునని రైతులకు సూచించారు. రైతులు తప్పకుండా వ్యవసాయ శాస్త్రవేత్త ల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. రైతులు వారి పంట దిగుబడి పెంచుకునేందుకు ఆధునాతన పనిముట్లను వాడాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజానం వినియో గించు కోవాలని తెలిపారు. భూసార పరీక్షల కోసం మట్టి నమూనాను సేకరించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రశాంత్, సర్పంచ్ రమేష్, ఉప సర్పంచ్ బొంగోని కుమార్ గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



**ముద్ర, కరీంనగర్:** రైతుల సంక్షేమం కోసం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు హుజురాబాద్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నాంపల్లి తిరుపతి అన్నారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని తాడికల్, కేశవపట్నంలోని తాడికల్ సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సర్పంచులు సుజా త, రాజేంద్రప్రసాద్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామాల్లో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. రైతుల సంక్షేమం కోసం గ్రామాల్లో అనేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## పాఠశాలకు కంప్యూటర్ల అందజేత



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లాలోని సోన్ మండలం పాక్పట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం ఇన్ఫినిటీ ఫిన్ కార్ప్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. లక్ష విలువైన ఐదు కంప్యూటర్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు సామాజిక సేవలో భాగంగా విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్ర శేఖర రావు, ఇన్ఫినిటీ రీజనల్ మేనేజర్ రాంరెడ్డి అనిల్ కుమార్, గ్రామస్తులు రమేష్ రెడ్డి, మధుకర్ రెడ్డి, గంగారెడ్డి, రాజారెడ్డి, రమేష్, పంచాయతీ కార్యదర్శి భూషణ్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం




**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ కొత్త బస్టాండ్ ఆవరణలో మంగళవారం స్థానిక సర్పంచ్ మునిగంటి స్వప్న, సంతోష్ ఆయన తండ్రి మునిగంటి నర్సయ్య జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేం ద్రాన్ని ఎస్సె స్వాతి, సైదాపూర్ వ్యవసాయ మార్కెట్ కమీటీ ఛైర్మన్ దొంత సుధాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సైదాపూర్ సర్పంచ్ స్వప్న, ఉప సర్పంచ్ నవీన్ కుమార్, వెంకేపల్లి సునీత, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్, విధ్వాన్ రెడ్డి, పలువురు వార్డు సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
22.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**సైకిల్ చరిత్ర**

1885లో జాన్ కెంప్ స్టార్లీ రూపొందించిన "సేఫ్టీ సైకిల్" ఆధునిక సైకిల్‌కు దగ్గరగా ఉంది. ఇది రెండు సమాన చక్రాలతో స్థిరత్వాన్ని పెంచింది.





## త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

● కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి: హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాల్లో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోనీ రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని, ఎలక్ట్రిసిటీ, స్ట్రీట్ లైట్, గ్రీనరీ, తాగునీరు, పైలాన్ స్తూపం స్థలాన్ని పరిశీలించి మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు హౌసింగ్ పీడీ సిద్ధార్థ, హార్టికల్చర్ పిడి నాగయ్య, తహసిల్దార్ కవిత, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

## ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి: రైతులు పండించిన ధాన్యం కుప్పలు తేమ శాతం చూసి వెంటనే కాంటావేసి కొనుగోలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఏడిఏఎస్ , ఎం ఏ ఓ ఎస్, ఏ ఈ ఓ ఎస్ కు మార్కెటింగ్, కోపరేటివ్, సివిల్ సప్లయస్ శాఖలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రోజా రాణి, జిల్లా సరఫరాల మేనేజర్ హరికృష్ణ, వ్యవసాయ అధికారి రమణారెడ్డి పాల్గొన్నారు.

## మహిళా బిల్లు పట్ల బీజేపీకి చిత్తశుద్ధి లేదు

● జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనురాధ



ముద్ర, తుంగతుర్తి: భారతీయ జనతా పార్టీ కి మహిళా బిల్లు పట్ల చిత్తశుద్ధి లేదని సూర్యాపేట జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు అన్నారు. మంగళవారం కొత్తగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహిళలను అత్యున్నత పదవి లో నియమించింది అలాంటి కాంగ్రెస్ పార్టీ మీద అబాండాలు వేయడం మానుకోవాలి అని హితావు పలికారు. డీలిమిటేషన్ పేరుతో మళ్ళీ అధికారంలోకి రావాలని భారతీయ జనతా పార్టీ కుటిల ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. మహిళా బిల్లు ను అమలు చేయకుండా భారతీయ జనతా పార్టీ యే అడ్డుపడుతుందని మహిళా లోకం గమనించి బిజెపి కి తగిన బుద్ధి చెప్పాలన్నారు.




## విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు

ముద్ర , మోత్కూర్: విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభను వెలికి తీసేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని తహసిల్దార్ జ్యోతి అన్నారు. ప్రజా పాలనలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ ఓ యాదమ్మ, ఉపాధ్యాయురాలు సి హెచ్ రేఖ, మహేశ్వరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి

ముద్ర, మోత్కూర్: ప్రజా పాలన–ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్, ఎస్సే రైటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, నాణ్యమైన భోజనం, వసతి వంటి సదుపాయాలను కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని, చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారి హాస్టల్ స్పెషల్ ఆఫీసర్ జి.సురేష్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి, క్రీడలు ఆడడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన కే బన్నీ, ఎం అవిలాష్, జి ఆదిత్య లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, మున్సిపల్ కమిషనర్ కే సతీష్ కుమార్, హాస్టల్ వార్డెన్ అశోక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సరదా విషాదంగా మారకూడదు

● మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు
● సూర్యపేట జిల్లా ఎస్పీ నరసింహ



ముద్ర, సూర్యపేట జిల్లా ప్రతినిధి: వేసవికాలంలో పిల్లలు సరదాగా ఈత నేర్చుకోవడానికి వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని, సరదా కాస్త విషాదంగా మారకూడదని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ సూచించారు. ఈత రానివారు బావులు, చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని ఈతను నేర్చుకునే వారు వారి తల్లిదండ్రుల సమక్షంలో నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువుల వద్దకు కాలువల వద్దకు కుంటలు వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగినట్లయితే పిల్లల ప్రాణానికి ప్రమాదమని, తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకొని పిల్లల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు.

### మైనర్ లకు వాహనాలు ఇవ్వకండి

జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్ లపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగినదని తల్లిదండ్రుల, మైనర్లకు వాహనం ఇవ్వకూడదని, వాహనం ఇస్తే వారు తెలిసి తెలియని డ్రైవింగ్ తో వాహనం నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, దానితో వారికి, ఎదుటి వ్యక్తులకు ప్రమాదం జరగటం వల్ల రెండు కుటుంబాలు నష్ట పోతున్నాయని అన్నారు. కాబట్టి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. మైనర్ డ్రైవింగ్ చేస్తూ వాహనం తో పట్టుబడిన వాహన యజమాని పై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలి

● తాళ్లూరి దిలీప్ చౌదరి



ముద్ర, ఖమ్మం: యువ న్యాయవాదుల హెల్త్ కార్డ్స్ కోసం కోర్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ అధ్యక్షుడు తాళ్లూరి దిలీప్ చౌదరి, తెలంగాణ జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల వంశీ కృష్ణ అన్నారు. తెలంగాణ న్యాయ శాఖ కార్యదర్శి పాపిరెడ్డిని కలిసి, న్యాయవాదుల సంక్షేమం, న్యాయవ్యవస్థ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది ఎక్కిరాల రాంబాబు హాజరై మద్దతు తెలిపారు.

# సమస్యలపై నివేదిక అందించాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి: సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై సత్వరమే నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా సూర్యాపేటలోని కేజీవిబిని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మెస్ కమిటీలు సక్రమంగా రిజిస్టర్ మెంటెయిన్ చేయాలని, రోజు వారీగా స్టాక్ వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచడం జరిగిందని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ప్రజా పాలనలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలతో పాటు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో రిపేర్లను గుర్తించి నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. రిపేర్ల కోసం నివేదికను అందించాలని తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతం వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టి రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో వసతి గృహాలలో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం వంట శాల, స్టోర్ గదులను, లివింగ్ రూమ్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.. విద్యార్థులకు అందిస్తున్న మెనూ పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కేజీవిబిలో ఫ్యాన్లు, మైనర్ రిపేర్ల కోసం కలెక్టర్ అవైలబుల్ నిధుల నుండి రూ.50వేలు అందించారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి డిబేట్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, ఎస్.ఓ.నారాయణమ్మ, జిసిడిఓ పుల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# వేణుగోపాల స్వామికి పంచామృతాభిషేకం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ మదన వేణుగోపాల స్వామి వారికి ఉదయం పాలు పెరుగు తేనె చక్కర పండ్ల రసాలు పసుపు కుంకుమ చందనాదులతో నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. మృగశిర నక్షత్రం పురస్కరించుకొని శ్రీ పద్మావతి అమ్మవారి కి నవకలశ పంచామృత అభిషేకాన్ని అర్చక స్వా ములు ఘనంగా నిర్వహించారు. స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.

తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.





## మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి నాగిరెడ్డి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి. టీ.నాగిరెడ్డి అన్నారు. మంగళవారం టైలరింగ్ శిక్షణ ధృవపత్రాలను అడిషనల్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి. కే.జంగారెడ్డితో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని సేర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) సహకారంతో ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉదిత టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ భువనగిరిలో ఏంపవరింగ్ రూరల్ మహిళా గార్మెంట్ కటింగ్ స్కిల్స్ ఫర్ స్కూల్ యూనిఫార్మ్స్ నాలుగు రోజులు శిక్షణ పొందిన భువనగిరి, వలిగొండ, బీబీనగర్, యాదగిరిగుట్ట, రామన్నపేట, మోట కొండూరు, తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజపేట వివిధ మండలలోని 200 మంది మహిళలకు శిక్షణ ధృపత్రాలు అందజేసినట్లు తెలిపారు. వచ్చే నెలలో స్కూలు యూనిఫామ్స్ కుట్టిపీయడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా కుట్టి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రమణ, భువనగిరి ఏపీఎం మల్లేష్, ఉదిత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు పాశం అలివేలు, జనార్ధన్, మోత్కూర్ ట్రైనింగ్ సెంటర్ అధికారి లక్ష్మీనారాయణ, ట్రైనింగ్ టీచర్స్ పబ్బల. విజయ, గీత పాల్గొన్నారు.

# కెమికల్ పరిశ్రమలను ఎత్తివేయాలి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహా




ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : దోతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాల్లోని ప్రజల ప్రాణాలను బలిగొంటున్న కెమికల్ పరిశ్రమలను తక్షణం తొలగించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పోచంపల్లి మండలం పరిధిలోని దోతిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో రసాయన పరిశ్రమలు తొలగించాలని నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహా మాట్లాడుతూ.. కెమికల్ పరిశ్రమల వ్యర్థాల కారణంగా భూగర్భ జలాలు కలుషితములున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు క్యాన్సర్, చర్మ వ్యాధులు, కిడ్నీ వ్యాధులు ఇతర తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. దోతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాల్లో 200 ఎకరాలకు పైగా రైతులు ప్రతీ పంటకు పంట నష్టపోతున్నారని అన్నారు. తక్షణం రసాయన పరిశ్రమలను ఎత్తివేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్నిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్, మాజీ మండల కార్యదర్శులు పగిళ్ల లింగారెడ్డి, ప్రసాదం విష్ణు, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో 'జయ'భేరి



ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి: జేఈఈ మెయిన్స్ లో జయ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించినట్లు కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సూర్యాపేట నుండి ఐదుగురు విద్యార్థులు 99 పైన పర్సంటేజ్ 26 గురు విద్యార్థులు 90 ఆపైన 74 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్డ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. కళాశాలకు చెందిన ఎన్. సాయి రిత్విక్ 99.55, జి శ్రీనిక 99.43, ఎస్ ఆశువర్ధన్ 99.36, ఎం రితిన్ శెట్టి 99.23, సిహెచ్ శివకుమార్ 99.09, ఎస్కె నేహా 98.68, డి సిరి 97.16, ఎండి హాదియా 96.96, జీ వంశీ 96.09, జి హర్షిత 95.92, వి గౌతమ్ కుమార్ 95.71 పర్సంటేజ్ సాధించారని తెలిపారు. ఆల్ ఇండియా అన్ని కేటగిరీ లలో 115, 563, 862, 963 లతో పాటు 5000 లోపు 10 ర్యాంకులు, 10000 లోపు 18 ర్యాంకులు సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కృషిచేసిన అధ్యాపక బృందాన్ని కరస్పాండెంట్, డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి లు అభినందించారు.

## జనగణన కీలకమైనది

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి: జనగణన ప్రక్రియ దేశ అభివృద్ధికి కీలకమైనదని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన జనగణన–2027 శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. జనగణన ప్రక్రియ దేశ అభివృద్ధికి కీలకమైనదని పేర్కొన్నారు. సమగ్రంగా, ఖచ్చితంగా డేటా సేకరణ చేయడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలవుతాయని తెలిపారు. శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 22-04-2026
www.mudranews.in | @mudranews



### సైకిల్ చరిత్ర

చైన్ డ్రైవ్ వ్యవస్థ ప్రవేశం సైకిల్ వేగాన్ని మరియు సౌకర్యాలను మెరుగుపరిచింది. దీంతో సైకిల్ సాధారణ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.



## ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం
# మీడియా అక్రెడిటేషన్ కార్డులు




● జిల్లా కలెక్టర్ హైమావతి

ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో జర్నలిస్టులకు మీడియా అక్రెడిటేషన్ జారీ చేస్తామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. ఐడీఓసీ మినీ సమావేశ మందిరంలో జిల్లాలో నూతనంగా ఎంపికైన జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి 2026–28 కాలానికి మీడియా అక్రెడిటేషన్ కార్డుల జారీపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులుగా ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో జర్నలిస్టులకు మీడియా అక్రెడిటేషన్ జారీ కోసం ఆన్లైన్ లో చేసుకున్న అప్లికేషన్లను, ఆయా మీడియా సంస్థలు అందజేసిన జాబితాను, జీవో కాపీని పరిశీలించి అర్హులైన వారికి అక్రెడిటేషన్ కార్డులను అందజేసేందుకు కమిటీ సభ్యులు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులతో కలిసి పరిశీలించాలని సూచించారు.

ఈ సమావేశంలో డీపీఆర్ఓ రవికుమార్, సమాచార శాఖ డీఈ భూపాల్, కమిటీ సభ్యులు కలకుంట్ల రంగాచారి, కే మహిపాల్ రెడ్డి, వంగ రాజు, పైడిపల్లి అరుణ్ కుమార్, బి. వంశీధర్, కూతురు రాజిరెడ్డి, ఐతే శ్రీనివాస్, ఎం.గిరిబాబు, సమాచార శాఖ సీనియర్ అసిస్టెంట్ రాంబాబు, సిబ్బంది రాములు, మహేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు

● కలెక్టర్ ప్రతిమా సింగ్

ముద్ర ప్రతినిధి, మెదక్:

సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చునని, రైతులు సాంప్రదాయ పంటల నుండి లాభసాటి కూరగాయల సాగువైపు మళ్లడం ద్వారా ఆర్థికాభివృద్ధి చెందుతారని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సాంప్రదాయ పంటలు తగ్గించి కూరగాయల వైపు దృష్టి సారించాలని కోరారు. కూరగాయల పంటలకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తుందన్నారు.

మంగళవారం టేక్మాల్ మండలం చంద్రు తండాలో కలెక్టర్ పర్యటించారు. 256 మంది రైతులు పండిస్తున్న కూరగాయల సాగును పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అనే నినాదానికి నిదర్శనంగా చంద్రు తండా నిలుస్తుందన్నారు. సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతూ లాభసాటి కూరగాయల పెంపకంతో కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి చెందడం హర్షించదగ్గ విషయంగా పేర్కొన్నారు. నాణ్యత గల కూరగాయలు రైతులే స్వయంగా మార్కెట్ కు తీసుకు వెళ్లి వ్యాపారం నిర్వహించుకుని లాభాలు పొందుతున్నారన్నారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ రూపంలో స్ప్రింక్లర్స్ అందించడం జరిగిందని, వ్యవసాయ అధికారులు రైతులకు కూరగాయల సాగుకు సంబంధించిన మెళకువలు అందించడం ద్వారా ఆర్థిక చేయూత కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సర్పంచి స్రవంతి సర్దార్, మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, ఏఈఓ వినోద్, రైతులు పాల్గొన్నారు.



### సెన్సెస్ శిక్షణా కేంద్రం పరిశీలన

టేక్మాల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సెన్సెస్ శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశీలించారు. ఫీల్డ్ సిబ్బందికి జనగణన ప్రక్రియ, నియమాలు, బాధ్యతలపై అవగాహన కల్పించడం, డేటా సేకరణను సక్రమంగా నిర్వహించడం దీని లక్ష్యంగా కలెక్టర్ పేర్కొన్నారు. జన గణనలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల పాత్ర కీలకమని, 34 పాయింట్లను జాగ్రత్తగా అధ్యయనం చేయాలని కలెక్టర్ సూచించారు.

### విద్యతోపాటు సామాజిక అంశాల్లో అవగాహన కల్పించాలి

విద్యతోపాటు సామాజిక అంశాలపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సంక్షేమ వారోత్సవాలలో రెండో రోజు టేక్మాల్ లోని బీసీ హాస్టల్ లో ఎంపీడీవో, ఎంఈఓతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. వసతి గృహంలోని స్టోర్ గది, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను సృజనాత్మకతలను వెలికి తీయడం, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలు, వివిధ సబ్జెక్టులలో జ్ఞానాన్ని, శీఘ్ర ఆలోచనా విధానాన్ని పరీక్షించడం కోసం క్విజ్ పోటీలు, బాలల హక్కుల, కార్యక్రమాలు, బాలల హక్కులు, విద్య, ఆరోగ్య అవగాహనపై వీధి నాటకాలు, సామాజిక న్యాయం, విద్య, పర్యావరణం–ఆంగ్లంలో, తెలుగులో చర్చ, ప్రసంగాలు సామాజిక న్యాయ, ప్రకృతి, సంస్కృతి అంశాలపై సృజనాత్మక వ్యక్తీకరణపై డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రియాయాయుద్దీన్, పంచాయితీ సెక్రెటరీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై వరి ధాన్యం అరబెట్ట వద్దు

- ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

ముద్ర ప్రతినిధి, మెదక్:



రహదారులపై వరి ధాన్యం అరబెట్టడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశముందని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. కొంతమంది రైతులు ధాన్యాన్ని రోడ్లపై అరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా ప్రమాదాలకు దారితీస్తోందని పేర్కొన్నారు. ధాన్యం చుట్టూ రాళ్లు పెట్టడం, బ్లాక్ పాలిథిన్ కవర్లతో కప్పడం వలన ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు గమనించక ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతులు రహదారులను వినియోగించకుండా, గ్రామ పంచాయతీ ప్రాంగణాలు, ఖాళీ స్థలాలు లేదా రహదారులకు దూరంగా ఉన్న సురక్షిత ప్రదేశాలను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు.

# బాధ్యతాయుతంగా జనగణన పూర్తి చేయాలి

● తెలంగాణ రాష్ట్ర జన గణన డైరెక్టర్ భారతి హొళ్లికేరి

ముద్ర ప్రతినిధి, మెదక్:

జనగణన – 2027ను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని జనగణ డైరెక్టర్ భారతి హొళ్లికేరీ అన్నారు. మంగళవారం మెదక్ మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ప్రతిమా సింగ్, జనగణన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జన గణనకు సంబంధించిన కిట్లను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు పంపిణీ చేశారు. మొదటి దశలో మే 11 నుంచి జూన్ 9 వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 20 27లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని అధికారులు తెలిపారు. ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి.. నమోదు చేయాలని ఆదేశించారు. అందరి వివరాలు గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఎండాకాలం నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీటి బాటిల్ వెంట తీసుకు వెళ్లాలని సూచించారు. ఈ నెల 26న స్వీయ గణన చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఉద్యోగి తప్పని సరిగా చేసుకోవాలని ఆదేశించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### ఆలయ నిర్మాణానికి రూ.2.50 లక్షలు విరాళం

ముద్ర, కామారెడ్డి:

కామారెడ్డిలోని మత్తడి పోచమ్మ ఆలయ నిర్మాణానికి హైకోర్టు అడ్వొకేట్ మొయిన్ హైమద్ ఖాద్రి రూ.2.50 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు డిష్ అశోక్‌కు అందజేశారు. గతంలోనూ ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షలు అందించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా ఆలయ నిర్మాణానికి మొత్తం రూ.7.50 లక్షలు అందించడంపై గ్రామస్థులు ఖాద్రిని అభినందించారు.

### పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ముద్ర, సంగారెడ్డి:

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం బిలాల్ పూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి కె. శ్వేతను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి తోడు ఫేక్ అటెండెన్స్, విధులకు గైర్హాజరుతో పాటు రూ.49 వేల ప్రభుత్వ సొమ్మును వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేసుకున్నారన్న అవినీతి ఆరోపణలను ఆమె ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఆమె కోహిర్ మండలం పీచరాగడి (ఏ) తాండా గ్రామపంచాయతీలో డెప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు జహీరాబాద్ డీఎల్పీఓ, కోహిర్ ఎంపీడీవోలు విచారణ చేపట్టగా.. విధులకు సకాలంలో హాజరు కాకపోవడం, గ్రామస్తులకు అందుబాటులో లేకపోవడం, ఫేక్ అటెండెన్స్ నమోదు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయని నివేదికలో పేర్కొన్నారు. బిలాల్ పూర్ గ్రామ పంచాయతీలో పని చేసిన సమయంలో ఈ–గ్రామ్ స్వరాజ్ నిధుల నుంచి రూ.49,030ను పీఎఫ్ఎంఎస్ ద్వారా ఆమె వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేసినట్లు గుర్తించారు. అలాగే హౌస్ ట్యాక్స్‌ను కొద్దిమంది నుంచే వసూలు చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ ఏప్రిల్ 20వ తేదీన ఉత్తర్వులు జారీ చేసి ఆమెను సస్పెండ్ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని పేర్కొన్నారు.

## ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య
# వారధిగా మీసేవ కేంద్రాలు




● ఎమ్మార్వో రవికిరణ్

ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా మీసేవ కేంద్రాలు పనిచేస్తాయని రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చార్జీల పెంపు అమల్లోకి వచ్చిందని సిద్దిపేట అర్బన్ ఎంఆర్ఓ రవికిరణ్ తెలిపారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అర్బన్ ఎమ్మార్వో కార్యాలయంలో మీసేవ సర్వీసు ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవ కేంద్రాలలో యూజర్ చార్జీలు రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని, ప్రజలు ఈ కొత్త చార్జీల గురించి తెలుసుకుని, మీసేవ కేంద్రాల సేవలను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మీసేవ యూనియన్ అధ్యక్షుడు గందే నాగరాజు, ఆడెపు మహేష్, ఫెరోజ్, భరత్, శ్రీకాంత్, మహేశ్వర్ రెడ్డి, కిషన్ రెడ్డి తదితర మీసేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నిరోధానికి అవగాహన కల్పించాలి

● అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

ముద్ర, నిజామాబాద్:

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి అవలంభించాల్సిన విధానాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలంను కట్టడి చేసేందుకు గట్టి నిఘా ఉంచాలన్నారు. క్లోరోఫాం, డైజోఫాం, ఆల్ప్రాజోలం వంటి వాటిని వినియోగిస్తూ తయారు చేసిన కల్తీ కల్లు సేవిస్తుండడం వల్ల అనేక మంది అనారోగ్యాల బారిన పడుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఎవరు కూడా కల్తీ కల్లు బారిన పడకుండా గ్రామగ్రామాన అవగాహన కల్పించాలని సూచించారు. నిరంతర దాడులు కొనసాగిస్తూనే, మత్తు పదార్థాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ వారిని చైతన్యపర్చాల్సిన అవసరం ఉందని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేస్తూ పూర్తి స్థాయిలో అవి పని చేసేలా చూడాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ అనేక చర్యలు చేపడుతోందని గుర్తు చేశారు. ఎక్కడైనా గంజాయి, క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, అల్ప్రాజోలం వంటి వాటి రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించాలని, టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు సమాచారం తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ సమావేశంలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో నిజామాబాద్ జోన్ ఏసీపీ సోమనాథం, ఏసీపీ ప్రకాష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, జిల్లా ఔషధ నియంత్రణ అధికారి శ్రీలత, డీఐ ఈఓ రవికుమార్, ఎంపీఐ శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్, సైకియాట్రిస్ట్ డా.రవితేజ తదితరులు పాల్గొన్నారు.




# రోబోటిక్ మోకాలి శస్త్రచికిత్సతో మంచి ఫలితాలు

ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:

రోబోటిక్ మోకాలి రీప్లేస్మెంట్ సిస్టం మంచి ఫలితాలు ఇస్తుందని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు డాక్టర్ విక్రమ్, ప్రతినిధి రాజిరెడ్డిలు తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మోకాలి రీప్లేస్మెంట్ చేసుకున్న పేషంట్లతో కలిసి యశోద ఆసుపత్రి వైద్యులు మాట్లాడారు. సిద్దిపేట పట్టణానికి చెందిన డాక్టర్ కుమార్, శకుంతల అనే పేషెంట్లకు 45 రోజుల క్రితం మోకాలి రీప్లేస్మెంట్ ఆపరేషన్ రోబోటిక్ ద్వారా నిర్వహించామని, 100% రీప్లేస్మెంట్ రిజల్ట్ సాధించామని తెలిపారు. రోబోటిక్ సిస్టం ద్వారా ఆపరేషన్ చేస్తే త్వరగా రికవరీ అవుతారని అన్నారు. సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో అత్యాధునిక సౌకర్యాలతో మోకాలి రిప్లేస్మెంట్ నిర్వహిస్తున్నామని అన్నారు. సిద్దిపేట పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




# బదిలీపై వెళుతున్న అడిషనల్ డీసీపీని అభినందించిన పోలీస్ కమిషనర్

ముద్ర, నిజామాబాద్: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ లో అడిషనల్ డీసీపీ (అడ్మిన్)గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న గట్టు బస్వారెడ్డిని పోలీస్ కమిషనర్ మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు బస్వారెడ్డి మెరుగైన సేవలను ప్రశంసించారు. పోలీస్ విభాగంలో ఆయన చేసిన కృషి, ప్రజల భద్రత కోసం తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా సీపీ గుర్తు చేశారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని సీపీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు పాల్గొని అడిషనల్ డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



సైకిల్ చరిత్ర: 19వ శతాబ్దం చివరలో సైకిల్ వినియోగం భారీగా పెరిగింది. ఇది మహిళల స్వేచ్ఛకు కూడా ఒక చిహ్నంగా మారింది.



# ఏసీబీ వలలో ఆర్డీవో

- లేటు బర్త్ సర్టిఫికెట్ల కోసం 25 వేలు లంచం
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ

**ముద్ర, నారాయణపేట:**



నారాయణపేట ఆర్డీవో రామచందర్ నాయక్ మంగళవారం ఏసీబీకి పట్టుబడ్డారు. లేట్ బర్త్ సర్టిఫికెట్ల కోసం లంచం డిమాండ్ చేయగా ఒక్కో బర్త్ సర్టిఫికెట్ కు రూ.5 వేల చొప్పున రూ. 25వేలు లంచం తీసుకుంటూ ఈసీబీకి పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ మాట్లాడుతూ గత సంవత్సరం జూలై లో ఓ వ్యక్తి బర్త్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం కు ఫైల్ ఫార్వర్డ్ అయిందని బర్త్ సర్టిఫికెట్ల కోసం ఆర్డీవో లంచం డిమాండ్ చేయగా డబ్బులు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేసే ఏసీబీని ఆశ్రయించవచ్చని ఏసీబీనీ ఆశ్రయించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇదిలా ఉండగా నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా అక్రమంగా కొంతమంది రైతుల పాసు బుక్కులు పెట్టించి నష్టపరిహారం డబ్బుల పేరిట పెద్ద కుంభకోణం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి గతంలో ఆరోపించారు. ఈ అంశాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని లోతైన దర్యాప్తు జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కాగా నారాయణపేట ఆర్డీవో రిటైర్మెంట్ సమయం కూడా దగ్గర పడిందని ఈ సమయంలోనే గతంలో నారాయణపేట ఆర్డీవో గా పని చేసిన రామచందర్ నాయక్ ను రిటర్మెంట్ సమయంలో రెవెన్యూ అక్రమాలు జరిపించేందుకు ఆర్డీవో గా తిరిగి ఇక్కడికి పిలిపించినట్లు సమాచారం. ఏది ఏమైనాప్పటికీ నారాయణపేట ఆర్డీవో ఏసీబీకి పట్టుపడడం జిల్లా కేంద్రంలో హాట్ టాపిక్ గా మారింది.



# తమిళనాడులో డీఎంకే కూటమిదే విజయం

- ఆత్మగౌరవానికి తమిళ ప్రజల మద్దతు
- తెలంగాణలో హామీలన్నీ అమలు చేశాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, తమిళనాడు:**

తమిళనాడులో డీఎంకే - కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడు శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ పరిశీలకుడు, మాజీ ఎంపీ మధు యాష్కీతో కలిసి రాణిపేట జిల్లా షోలింగర్ నియోజకవర్గంలో నీకారిక్కల్, వీరనట్టూర్, అరియూర్, అయిపేడు ప్రాంతాల్లో మంగళవారం కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ తమిళ ప్రజలు అభివృద్ధి, లోకికవాదానికి, ఆత్మ గౌరవానికి మద్దతు చెబుతారని ఆకాంక్షించారు. ఎం.కె. స్టాలిన్ నాయకత్వంలోని ప్రభుత్వం భారీ మెజారిటీతో తిరిగి అధికారాన్ని కైవసం చేసుకోబోతోందని చెప్పారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. గృహ జ్యోతిలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. తమిళనాడు రాజకీయాలు దేశానికే దిక్సూచిగా నిలుస్తాయని కొనియాడారు. పెరియార్, అన్నా దురై, కరుణానిధి వంటి మహనీయులు ఇక్కడ సామాజిక న్యాయానికి బలమైన పునాదులు వేశారన్నారు. బీజేపీ ప్రభుత్వ పెద్దలు తమిళ సంస్కృతిని, భాషను, హక్కులను అణచివేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఇలాంటి శక్తులను ఎదుర్కోవాలంటే సెక్యులర్ శక్తుల ఐక్యత అనివార్యమని, అందుకే స్టాలిన్ నాయకత్వాన్ని బలపరచాలని ఆయన పిలుపునిచ్చారు. రాహుల్ ప్రేమ సందేశం, స్టాలిన్ అభివృద్ధి నినాదం ఒక్కటయ్యాయన్నారు. నియంతృత్వాన్ని ఓడించి, విద్వేషం లేని సమాజాన్ని నిర్మించుకోవాలని, ఇక్కడ కేవలం ప్రేమకు, సమధర్మానికి మాత్రమే చోటు ఉందని నిరూపించాలని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు తాము సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెప్పారు. అదే స్ఫూర్తితో తమిళనాడులో కూడా అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే డీఎంకే కాంగ్రెస్ కూటమిని గెలిపించాలని కోరారు.




# కొత్త బొగ్గు అమ్మకం విధానంలోనూ సత్తా చాటాలి

- నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- తక్కువ ధరకు బొగ్గు విక్రయించాలి
- దేశవ్యాప్త బొగ్గు గనుల పనితీరుపై సమీక్ష
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి

**ముద్ర, న్యూఢిల్లీ :**

ప్రతీ ప్రభుత్వ సంస్థ కూడా బొగ్గు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పోటీ మార్కెట్లో నిలదొక్కుకునేలా కృషి చేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం న్యూ ఢిల్లీ నుంచి ఆయన దేశవ్యాప్త బొగ్గు కంపెనీల పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. దేశంలోని బొగ్గు వినియోగదారులు తమకు నచ్చిన చోట నచ్చిన గ్రేడు బొగ్గును పొందే విధంగా నేషనల్ కోల్ ఎక్స్ఛేంజ్ ద్వారా బొగ్గు అమ్మకపు విధానాన్ని ప్రవేశపెడతామన్నారు. సింగరేణిపై సమీక్షిస్తూ నేటి పోటీ మార్కెట్లో నిలదొక్కుకోవడానికి సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును తక్కువ ధరకు అమ్మడానికి కృషి చేయాలని సూచించారు. కొత్త గనులను చేపడుతూ నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సింగరేణి తరపున సమీక్షలో పాల్గొన్న సంస్థ సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. ఈ ఏడాది ఐదు కొత్త ఓపెన్ కాస్ట్ గనుల ప్రారంభానికి అవసరమైన అనుమతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఇల్లందులోని జేకే ఓసీ, మణుగూరు ఓపెన్ కాస్ట్ ఎక్స్టెన్షన్, రామగుండం ఓపెన్ కాస్ట్ 1ఫేజ్ 3, గోలేటి ఓసీ, ఆర్కే ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నాయన్నారు. వీటికి అటవీ, పర్యావరణ శాఖల అనుమతులు అవసరముందన్నారు. సింగరేణి సంస్థ వినియోగదారులకు మరింత నాణ్యమైన బొగ్గును అందించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎండాకాలం బొగ్గు నిల్వలు లేకుండా రవాణా పెంచుతున్నట్లు వివరించారు. కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ భూమి అందుబాటులో లేనందున, సింగరేణిలో కొత్తగనులను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు వీలుగా సింగరేణి సంస్థకు సీపీఎస్యూ హోదా అవసరమై ఉందన్నారు. ఈ సమావేశంలో సింగరేణి భవన్ నుంచి సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్), తిరుమలరావు (ఈ అండ్ ఎం), ఈడీ(కోల్ మూవ్మెంట్) బి.వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకంలో లొసుగులు


- సీపీఐ జాతీయ నియంత్రణ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కే. నారాయణ

**ముద్ర, హైదరాబాద్:**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చాలా లొసుగులున్నాయని వాటిని సవరించాలని సీపీఐ జాతీయ నియంత్రణ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కే. నారాయణ అన్నారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశంలో మాట్లాడారు. ఈ పథకం ప్రారంభంలో పని చేసేందుకు కూలీలకు పనిముట్లు అందజేసేవారని, ప్రస్తుతం కూలీలు తమ పనిముట్లు తామే తీసుకురావాలని వేధిస్తున్నారని అన్నారు. ఉదయం ఐరిస్ పేరిట ఒకసారి మళ్ళీ మధ్యాహ్నం ఒకసారి ఫొటోలు తీయడం వలన సమయం వృథాతోపాటు, కూలీలను వేధింపుగానే పరిగణించాలని అన్నారు. గ్రామీణ ఉపాధి కూలీలు ఎండాకాలంలో సేద తీరేందుకు షామియానా ఏర్పాటు చేయాల్సి ఉందని, డీహైడ్రేషన్ కాకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ఇవ్వాల్సి ఉన్నా కూడా ఇంకా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయలేదన్నారు. ఒకే కుటుంబంలో భార్యా, భర్తలు పనిచేయడం వల్ల వాళ్లకి పని రోజులను 50 రోజులు మాత్రమే పని రోజులు కుదించడం సరికాదని, భార్యాభర్తలైన వేరువేరు లబ్ధిదారుల కార్డుల కలిగిన వారికి ప్రతికూలీకి కూడా 120 రోజులు పనులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలా పని రోజులను కుదిరించడం వలన వారు ఆర్థికంగా నష్టపోతున్నారని వాపోయారు. గుంతలు తవ్వేటప్పుడు పాములు, తేళ్లు వస్తున్నాయని ఒకవేళ అవి కూలీలను కాటేస్తే దానికి తగిన ప్రథమ చికిత్స పరికరాలను, మందులను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదసావత్తు ఉపాధి హామీ కూలీకి ఏదైనా జరిగితే వారి కుటుంబాన్ని ఆదుకునేలా ప్రమాద బీమా పథకాన్ని కూడా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో కోతలు విధించడం సరికాదన్నారు. సంపన్నులకు దాదాపు రూ.29 లక్షల కోట్లు రైటాఫ్ చేసి ఎండనక, వాననక కష్టపడుతున్న ఉపాధి హామీ కూలీల బడ్జెట్లో కోతలు విధించడం, ఆంక్షలు పెట్టడం సబబు కాదన్నారు.

# ఏసీబీ వలలో వికారాబాద్ మహిళ పోలీస్ సీఐ, ఎస్ఐ

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**




కుటుంబ కలహాల కేసులో బెయిల్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన మహిళా సీఐ, ఎస్సైలు ఏసీబీ వలకు చిక్కారు. ఏసీబీ డీఎస్పీ రంగారెడ్డి రేంజ్ ఆనంద్ కుమార్ అందించిన వివరాప్రకారం తాండూరు కౌన్సిలర్ ఇర్షాద్ పై నమోదైన సెక్షన్ 498 ఏ కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు వికారాబాద్ ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ సరోజ, ఎస్ఐ రాణి రూ.60 వేలు డిమాండ్ చేశారని తెలిపారు. అవినీతికి తలొగ్గడం ఇష్టం లేని ఇర్షాద్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు ముందస్తు సమాచారం అందించారు. దీంతో లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులకు పోలీసులు రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డారు. ఇప్పటి వరకు ఐదుగురు అవినీతి అధికారులను చట్టానికి పట్టించాను, ప్రజలు కూడా ధైర్యంగా ముందుకు రావాలి అని ఈర్షద్ ఈ సందర్భంగా తెలిపారు.



# జాబ్ మానేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 'గంజాయి' సాగు

- మత్తుకు బానిసై ఉద్యోగం పోయింది..
- కొనేందుకు డబ్బులు లేక ఇంటి పైకప్పునే గంజాయి వనంగా మార్చాడు
- టీ ఉద్యోగి ఇంటి డాబాపై పోలీసుల మెరుపు దాడి!
- 17 గంజాయి మొక్కలతో పట్టుబడిన మాజీ టెక్కీ..

**ముద్ర, డెస్క్ :**



హైదరాబాద్ నగరంలో చోటుచేసుకున్న ఒక వింతైన విచారకరమైన ఘటన ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నతమైన భవిష్యత్తు ఉండాల్సిన ఒక యువకుడు.. మత్తు మహమ్మారి కోరల్లో చిక్కుకుని తన జీవితాన్ని ఎలా నాశనం చేసుకున్నాడో ఈ ఉదంతం కళ్ళకు కట్టినట్లు చూపుతోంది.

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నుంచి గంజాయి సాగు వరకు..**

హైదరాబాద్‌లోని నాచారం ప్రాంతంలో నివసించే శశిధర్ రెడ్డి అనే యువకుడు గతంలో ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఇంజనీర్‌గా పని చేసేవాడు. ఐటీ రంగంలో మంచి జీతంతో గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్న తరుణంలో అతనికి మత్తు పదార్థాల అలవాటు ఏర్పడింది. క్రమంగా ఈ వ్యసనం తీవ్రమవడంతో పనిపై శ్రద్ధ తగ్గింది. దీనివల్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటంతో చివరకు తన సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని కోల్పోయాడు. ఉద్యోగం పోవడంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఒకవైపు చేతిలో డబ్బులు లేకపోవడం.. మరోవైపు గంజాయి తాగాలనే కోరిక తీవ్రంగా ఉండటంతో శశిధర్ రెడ్డి ఒక ప్రమాదకరమైన నిర్ణయం తీసుకున్నాడు. బయట గంజాయి కొనడానికి డబ్బులు లేని తరుణంలో తానే స్వయంగా గంజాయిని సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు.

**ఇంటి పైకప్పుపై గంజాయి వనం**

ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు శశిధర్ రెడ్డి తన ఇంటి డాబాను సాగు క్షేత్రంగా మార్చుకున్నాడు. అక్కడ ఉన్న పూల కుండీల్లో గంజాయి విత్తనాలు నాటి, వాటిని జాగ్రత్తగా పెంచడం ప్రారంభించాడు. మొదట ఒకటి రెండు మొక్కలతో మొదలైన ఈ ప్రయత్నం, చివరకు 17 పెద్ద గంజాయి మొక్కల వరకు చేరింది. చుట్టు పక్కల వారు సాధారణ మొక్కలే అనుకునేలా వాటిని మధ్యలో ఉంచి పెంచడం గమనార్హం.

**పోలీసుల మెరుపు దాడి**

ఈ అక్రమ సాగు గురించి సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు, స్థానిక నాచారం పోలీసులు శశిధర్ రెడ్డి నివాసంపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఇంటి పైకప్పుపై ఏపుగా పెరిగిన గంజాయి మొక్కలను చూసి పోలీసులు సైతం అవాక్కయ్యారు. సాధారణంగా మారుమూల అటవీ ప్రాంతాల్లో జరిగే ఈ సాగును నగర నడిబొడ్డున ఒక ఐటీ నిపుణుడు సాగు చేయడం చర్చనీయాంశమైంది.

**పోలీసులకే షాక్ ఇచ్చిన నిందితుడి సమాధానాలు**

విచారణ సమయంలో శశిధర్ రెడ్డి పోలీసులతో వ్యవహరించిన తీరు వింతగా ఉంది. "అయ్యా.. ఇవి గంజాయి మొక్కలని నాకు తెలియదు. ఏదో అందమైన సాధారణ మొక్కలు అనుకుని పెంచాను" అంటూ బుకాయించే ప్రయత్నం చేశాడు. అయితే పోలీసులు సాంకేతిక ఆధారాలతో అవి గంజాయి మొక్కలేనని నిర్ధారించారు.

**పోలీసుల దర్యాప్తులో తేలిన ప్రధానాంశాలు..**

నిందితుడు కేవలం వినియోగదారుడే కాకుండా సాగుదారుడిగా కూడా మారాడు. ఈ విత్తనాలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఆన్‌లైన్‌లో ఏవైనా వెబ్‌సైట్ల ద్వారా తెప్పించుకున్నాడా? అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. తక్కువ సమయంలో ఎక్కువ మొక్కలను పెంచడానికి అతను అనుసరించిన పద్ధతులపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు.

**యువతకు ఒక హెచ్చరిక**

ఈ ఘటన నేటి తరం యువతకు, ముఖ్యంగా ఐటీ ఉద్యోగులకు ఒక గట్టి హెచ్చరిక. ఒత్తిడిని దూరం చేసుకోవడానికో లేదా సరదాకో మొదలయ్యే మత్తు అలవాట్లు, చివరికి ఒక వ్యక్తిని నేరస్థుడిగా మారుస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. "చదువుకున్న యువత ఇలాంటి అక్రమాలకు పాల్పడటం అత్యంత విచారకరం. డ్రగ్స్ వల్ల కెరీర్ మాత్రమే కాదు, కుటుంబం.. సామాజిక గౌరవం కూడా మంటగలుస్తాయి." అని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం పోలీసులు శశిధర్ రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నగరంలో ఇలాంటి అక్రమ సాగులు ఇంకెక్కడైనా జరుగుతున్నాయా అనే కోణంలో డ్రోన్ల సహాయంతో కూడా నిఘా పెంచాలని అధికారులు యోచిస్తున్నారు. చదువుకున్న వారు నేరాల బాట పడితే చట్టం మరింత కఠినంగా ఉంటుందని ఈ ఉదంతం నిరూపిస్తోంది.

# వెయ్యేళ్లైనా బీఆర్ఎస్ మారదు

- జీవన్ రెడ్డి తెలంగాణ వ్యతిరేకి
- వైఎస్ అండతో రెండుసార్లు ఉద్యమ నాయకత్వంపై పోటీ చేసిండు
- కేంద్రాన్ని బీఆర్ఎస్ పల్లెత్తు మాట అనలే
- గుంటనక్కతో గుంపు మేస్త్రీ డీల్ మాట్లాడుతున్నడు
- కోర్టు తీర్పులను ప్రభావితం చేసేలా సీఎం వ్యాఖ్యలు
- ప్రతిపక్షం లేకుండా చేస్తామంటే ప్రజలు తీసి బొంద పెడుతరు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




వెయ్యి ఏండ్లు అయినా బీఆర్ఎస్ పార్టీ మారదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బీఆర్ఎస్ తొవ్వలోనే కాంగ్రెస్ వెళ్తోందన్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఓటమిపై బీఆర్ఎస్ ఇప్పటికీ ఆత్మవిమర్శ చేసుకోవడం లేదని, ప్రజలే తప్పు చేశారని ప్రజలను చులకన చేసి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 75 ఏళ్ల కురువృద్ధుడిని చేర్చుకుని ఆయనకే 25 ఏళ్లు తగ్గినయి, నవ యువకుడు అంటే తెలంగాణలో ఉన్న యువత పరిస్థితి ఏంటని, తండ్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ప్రశ్నించారు. 75 ఏళ్ల కురువృద్ధుడిని చేర్చుకొని రాజకీయ పునరేకీకరణ అంటున్నారని, ఈ పేరుతో తెలంగాణ వ్యతిరేక శక్తులను తీసుకువచ్చి పునర్నిర్మాణ యజ్ఞం చేస్తామని చెప్తున్నారంటే జన్మలో బీఆర్ఎస్ మారదని తేల్చి చెప్పారు.

**జీవన్ రెడ్డి తెలంగాణ వ్యతిరేకి**

జీవన్ రెడ్డి పచ్చి తెలంగాణ వ్యతిరేకి అని అన్నారు. తెలంగాణ కోసం ఉద్యమ నాయకత్వం రెండుసార్లు పదవులకు రాజీనామా చేసినప్పుడు తనకు వైఎస్ నాయకత్వం ఉంటే చాలు తెలంగాణ ఎందుకంటూ ప్రశ్నించిన వ్యక్తి అని అన్నారు. ఉద్యమ నాయకత్వంపై రెండుసార్లు ఉప ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తి అని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నాయకత్వం పల్లెత్తు మాట కూడా అనకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్షాలు ఒకే రోజు భారీ బహిరంగ సభలు పెట్టి బలప్రదర్శనకు దిగాయి, తప్పితే ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ ఉత్తి కథలు చెప్తే.. కాంగ్రెస్ పార్టీ పిట్టకథలు చెప్పిందని విమర్శించారు.

**ఓ గుంట నక్క .. గుంపు మేస్త్రీ**

ఓ గుంట నక్క ఆర్ఎస్ఎస్ పెద్దలను కలవడానికి ఢిల్లీ వెళ్లారని గుంపుమేస్త్రీ అంటున్నారని.. ఆర్ఎస్ఎస్ పెద్దలను కలవడానికి బీఆర్ఎస్ నాయకుడు వెళ్తే ముఖ్యమంత్రిగా ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో ఏదో జరగబోతుందని కోర్టు తీర్పులను ప్రభావితం చేసేలా సీఎం మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం లేకుండా చేయడానికి రేవంత్ రెడ్డి ఎవరని ప్రశ్నించారు. ఎవరు ప్రతిపక్షంలో ఉండాలో, ఎవరు పాలకపక్షంలో ఉండాలో డిసైడ్ చేయాల్సింది ప్రజలు కదా అని అన్నారు. పదేళ్లు తానే సీఎంగా ఉంటానని ఎలా చెప్తారని, కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని ప్రజలు రెండోసారి ఓట్లేస్తారని ప్రశ్నించారు. సీజన్ మొత్తం అయిపోయిన తర్వాత కూడా సగం మందికి రైతుభరోసా ఇవ్వలేదని, హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చేస్తున్నారని, కుమ్మెర జాతరలో రెండు నెలల పాప చనిపోయినా మాట్లాడలేదని, ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా, జాబ్ క్యాలెండర్ ఇచ్చారని మీరు మళ్లీ అధికారంలోకి వస్తారా అని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

**25న వస్తున్నాం..**

కొత్త రాజకీయ శక్తిగా ఈనెల 25న వస్తున్నామని, ప్రజల కష్టాలు తీర్చేందుకు ఒక ఆడబిడ్డగా తాను ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. ప్రజలంతా తరలివచ్చి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ ఆవిర్భావ సభకు సిరిసిల్ల నుంచి పార్టీ కార్యకర్తలు పాదయాత్రగా బయల్దేరారని, రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే క్యాడర్ వాహనాలకు ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని పోలీసులు, అధికార యంత్రాంగాన్ని కోరారు.

**సైకిల్ చరిత్ర:**
రబ్బరు టైర్లు (ప్న్యూమాటిక్ టైర్లు) రావడంతో ప్రయాణం మరింత సౌకర్యవంతమైంది. ఇవి షాక్‌ను తగ్గించి స్మూత్ రైడ్‌ను అందించాయి.





# యుద్ధ ప్రాతిపదికన ధాన్యం సేకరించాలి

- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

ముద్ర, నల్గొండ :

నల్లగొండ జిల్లాలో యాసంగి వరి ధాన్యం సేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మంత్రి నల్గొండలోని తన క్యాంపు కార్యాలయం ఇందిరా భవన్ లో కలెక్టర్ బి. చంద్రశేఖర్ తో కలిసి పౌరసరఫరలు, మార్కెటింగ్, డీఆర్డీఏ. రవాణా, కోఆపరేటివ్ తదితర శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో యాసంగి దాన్యం సేకరణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అన్నికొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా నీడ. తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. నల్గొండ నియోజకవర్గంలోనే 2.49లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజు 10వేల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేయాలని చెప్పారు. ఎక్కువగా ధాన్యం వచ్చేందుకు అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి అక్కడ ఎక్కువ లారీలు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చంద్రశేఖర్ ను ఆదేశించారు. కనగల్, ధర్వేశిపురం తదితరచోట్ల ఖాళీగా ఉన్న వ్యవసాయ గోదాములలో ధాన్యం ఉంచేందుకు చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశం, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, డీసీఓ పత్యా నాయక్, ,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్, ఆర్టీవో లావణ్య, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

**బంగారు తెలంగాణ ఒకేసారి సాధ్యమేనా?**

రాష్ట్రాన్ని ఒకేసారి బంగారు తెలంగాణ చేస్తామని కాంగ్రెస్ ఎప్పుడూ చెప్పలేదని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. నల్గొండ జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల అవినీతి జరిగిందని కోమటిరెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించామని తెలిపారు.

# మూడు నెలల్లో చర్యలు తీసుకోవాలి

- **రజత్ కూతురు పెళ్లి ఖర్చు వివాదంపై ఢిల్లీ హైకోర్టు ఆదేశం**

ముద్ర, తెలంగాణ బ్యూరో:



తెలంగాణ ఇరిగేషన్ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ, రిటైర్డ్ ఐఏఎస్ రజత్ కుమార్ కూతురు పెళ్లి ఖర్చు కు సంబంధించిన వివాదంపై మూడు నెలల్లో చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. రజత్ కుమార్ కూతురు పెళ్లి విలాసవంతమైన తాజ్ ఫలక్నుమా ప్యాలెస్‌తో సహా హైదరాబాద్‌లోని వివిధ 5నక్షత్రాల హోటళ్లలో ఐదు రోజుల పాటు ఘనంగా జరిగిందని..ఈ ఖర్చును కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ కంపెనీ మెగా కృష్ణారెడ్డి సంస్థ షెల్ కంపెనీల ద్వారా చెల్లించారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నారాయణ్ పేట్ సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ డీవోపీటీలో పిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో పిటిషనర్ ఢిల్లీ హై కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. శ్రీనివాస్ పిటిషన్ ను విచారించిన ఢిల్లీ హైకోర్టు ఫిర్యాదుపై మూడు నెలల వ్యవధిలో నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తెలంగాణ రాష్ట్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ దివన్, పిటిషనర్ తరపు న్యాయవాది అక్షయ్ మన్ వాదనలు వినిపించారు.

# ప్రజలను వంచిస్తున్న ప్రభుత్వం

- **కేసీఆర్ పుణ్యం వల్లే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు**
- **చంద్రబాబు స్కెచ్ తోనే రేవంత్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు**
- **కాంగ్రెస్ ను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చిన సీఎం**
- **బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి**

ముద్ర ప్రతినిధి, జగిత్యాల:



ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ లో చేరిన తర్వాత మొదటిసారి మంగళవారం జగిత్యాలలోని పార్టీ కార్యాలయానికి వచ్చిన జీవన్ రెడ్డి.. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు తో కలిసి మీడియాతో మాట్లాడారు. జగిత్యాలలో నిర్వహించిన కేసీఆర్ బహిరంగ సభ తెలంగాణ ఉద్యమాన్నీ తలపించిందని తెలిపారు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్నారంటే, అది కేసీఆర్ పుణ్యమేనని చెప్పారు. రెండుసార్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా దేశంలో తెలంగాణను మొదటి స్థానంలో నిలిపారని చెప్పారు. కేసీఆర్ రైతులకు రైతు బంధు ఇచ్చి ఆదుకుంటే రేవంత్ రెడ్డి మూడు పంటలకు రైతు భరోసా ఎగ్గొట్టారని మండిపడ్డారు. కేసీఆర్ కిట్ పేరు నచ్చకపోతే ఇందిరమ్మ పేరుతో అమలు చేయాలని కోరారు. ప్రజలు పాలన మార్పు కోరుతున్నారని తెలిపారు. వాస్తవాలు మాట్లాడితే కేసీఆర్ ను ఉరి తీస్తావా అని ప్రశ్నించారు. మేడిగడ్డి కుంగి పోయి 30 నెలలైందన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పుడు నిద్ర లేచినట్టు నటిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ ను దోషిగా చేయడం కోసం జాప్యం చేస్తున్నారని విమర్శించారు. తుమ్మిడిహెట్టి వద్ద ఎందుకు బ్యారేజీ నిర్మించలేదని నిలదీశారు. రేవంత్ రెడ్డి ఇంకా రెండేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారో లేదో అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఏ క్షణమైనా మార్పులు జరగవచ్చని వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి బీజేపీతో ములాఖత్ అయ్యారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆయనకు నమ్మకం లేదని విమర్శించారు. సొంత కుంపటి పెట్టుకోవాలనే ఆలోచనలో రేవంత్ ఉన్నారని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి రాష్ట్రానికి శనిలా మారారని, అది తొలగిపోవాలన్నారు. తన ప్రజా జీవితం తెరిచిన పుస్తకమన్నారు. నాదెండ్ల భాస్కర్ రావు ను తొలగించడం సరికాదని, ఇందిరా గాంధీ సైతం అండగా నిలిచిందని గుర్తు చేశారు. అందుకే తాను రాజీనామా చేసినట్లు చెప్పారు. 1984 లో పార్టీ ఫిరాయింపు చట్టమే లేదన్నారు. శాసన సభ రద్దు అయిన తర్వాతా పార్టీ ప్రజస్వామికంగా మారానన్నారు. 2014లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక్కడినే గెలిచానని చెప్పారు. 2019 లో శాసన మండలి లో ఒంటరిగా పోరాటం చేశానన్నారు. తాను ఏనాడు పదవులు ఆశించలేదన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ద్వితీయ శ్రేణి నాయకత్వం ఎదిగింది జగిత్యాలలోనేనని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రయాణంపై స్పందిస్తూ, తన సమర్థత వల్లే తాను అన్ని సార్లు అవకాశాలు పొందానన్నారు. తాను ఎవరినీ తొక్కుకుంటూ రాజకీయాల్లోకి రాలేదని స్పష్టం చేశారు. 20 నెలలు మానసిక క్షోభ అనుభవించిన తనను కేసీఆర్ పెద్ద మనసుతో అక్కున చేర్చుకున్నారని చెప్పారు. చంద్రబాబు స్కెచ్ తోనే రేవంత్ రెడ్డిడ్డి కాంగ్రెస్ లో చేరినట్లు ఆరోపించారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చారని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్, మార్క్ ఫెడ్ మాజీ చైర్మెన్ లోక బాపురెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు, శ్రీకాంత్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# వివాదాస్పద వ్యాఖ్యలను అడ్డుకోండి


- **కూటమి నేతలకు సూచనలు చేయండి**
- **తెలంగాణ ఏర్పాటుపై అనవసర ద్వేషాలు రగల్చడం మంచిది కాదు**
- **తెలుగువారి మధ్య ద్వేషాలు రగిలిస్తున్నాయి**
- **ఏపీ సీఎం చంద్రబాబు కు మంత్రి పొన్నం బహిరంగ లేఖ**

ముద్ర, తెలంగాణ బ్యూరో:



రాష్ట్ర విభజనపై వివాదాస్పద, అనుచిత వ్యాఖ్యలు చేయకుండా కూటమి నేతలను అడ్డుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. తెలంగాణ ఏర్పాటుపై అనవసర ద్వేషాలు రగల్చడం ఎవరికీ మంచిది కాదన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. అందులో కీలక అంశాలు ప్రస్తావించారు. ఏపీలో మీ భాగస్వామ్య పక్షాలైన బీజేపీ నాయకులొకవైపు, జనసేన అధినేతతో పాటు మరోవైపు టీడీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సముచితంగా లేవన్నారు. రాష్ట్ర విభజన ఏదో అనుచితంగా జరిగినట్టు, అసమంజసంగా తెలంగాణ ఏర్పడినట్టు చేస్తున్న అసందర్భపు వ్యాఖ్యలు తెలుగువారి మధ్య అనవసరమైన ద్వేషాలు రగిలించేవిగా ఉంటున్నాయన్నారు. ఇది ఎవరికీ మంచిది కాదన్న పొన్నం.. ఏపీలో సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతున్న కూటమి పెద్దగా మీరు చొరవ తీసుకొని మీ భాగస్వామ్య పక్షాలైన పార్టీ నేతల వ్యాఖ్యల విషయంలో జోక్యం చేసుకోవాలన్నారు.

రాష్ట్ర విభజనలో ప్రతి చర్య చట్టబద్ధం అన్నారు. లోకసభ, రాజ్యసభ బిల్లు ఆమోదం పొంది రాష్ట్రపతి ఆమోదంతో గెజిట్ విడుదల చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర విభజనను బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంట్ ప్రత్యేక భేటీ వేదికగా చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై విషం చిమ్మే విధంగా ఉన్నాయన్నారు. ఆంధ్ర ప్రగతికి తెలంగాణ దిష్టి తగిలిందంటూ మీ మరో భాగస్వామి జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తెలంగాణ మనోభావాల్ని కలతకు గురిచేశాయన్నారు. 'ఒక ఓటు రెండు రాష్ట్రాల'ని 1997లోనే తీర్మానం చేసిన పార్టీ బీజేపీ అని బహుశా ప్రధాని మోడీకి తెలియదేమో అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి ఈ విషయం చెప్పాలన్నారు. తెలుగువారందరం పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగటం అవసరమన్నారు.



# ఎన్డీఏతోనే అభివృద్ధి సాధ్యం

- **తమిళనాడు ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు**

ముద్ర న్యూస్:

తమిళనాడులో ఎన్నికల ప్రచారం వేగం అందుకుంది. మంగళవారం సాత్తూర్ నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించి ఎన్డీఏ కూటమి అభ్యర్థుల తరపున విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో సమావేశమై ఎన్నికల వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన సభలో మాట్లాడుతూ ఎన్డీఏ పాలనతోనే తమిళనాడు అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఏపీలో గతంలో జరిగిన నష్టాన్ని తమ ప్రభుత్వం కేంద్ర సహకారంతో పునర్నిర్మాణ దిశగా తీసుకెళ్తోందని తెలిపారు. తమిళనాడుకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మధురై ప్రాంతం అభివృద్ధికి ఇంకా అవకాశాలు ఉన్నాయని చెప్పారు.ద్రవిడ ప్రాంతాలన్నీ ఒకే సాంస్కృతిక బంధంతో ఉన్నాయని తెలిపారు. చెన్నైకి తెలుగు గంగ ద్వారా తాగునీరు అందించడంలో ఎన్టీఆర్ చేసిన కృషిని గుర్తుచేశారు. చెన్నై గతంలో దక్షిణ భారతదేశానికి కీలక కేంద్రంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం అభివృద్ధి మందగించిందని విమర్శించారు. ఎన్డీఏ అధికారంలోకి వస్తే చెన్నైతో పాటు మొత్తం తమిళనాడును అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ప్రజలు తమ ఓటుతో రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించాల్సిన సమయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

# బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- **ఉద్యోగ బదిలీలపై నిషేధం ఎత్తివేత**
- **మే 1 నుంచి మే 31 వరకు**
- **ఉత్తర్వులు జారీ**

ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో నంబర్ 38 విడుదల చేసింది. ఈ బదిలీల ప్రక్రియ మే 1 నుంచి మే 31 వరకు జరగనుంది. ఒకేచోట మూడేళ్లు పనిచేసిన ఉద్యోగుల బదిలీలకు సర్కార్ అనుమతి ఇచ్చింది. నాలుగేళ్లకు మించి ఒకేచోట పోస్టింగ్‌లో ఉండరాదని స్పష్టం చేసింది. భార్యాభర్తలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ముందుగా ప్రాధాన్యం ఉండనుంది. మొత్తం ఉద్యోగుల్లో 40 శాతానికి మించకుండా మాత్రమే బదిలీలు చేపట్టాలని సర్కార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

**బదిలీలకు కొత్త మార్గదర్శకాలు విడుదల..**

**మే 1నుంచి మే 31 వరకు బదిలీలకు అవకాశం**
**01-–01-–2026 నాటికి ఒకే స్థానంలో కనీసం 3 సంవత్సరాలు పూర్తి చేసిన వారు బదిలీకి అర్హులు**
**భార్య/భర్త కారణాలతో బదిలీ కోరే వారికి 3 సంవత్సరాల షరతు నుంచి మినహాయింపు**
**31-–12-–2025 నాటికి ఒకే చోట 4 సంవత్సరాలు పూర్తి చేసినవారిని తప్పనిసరిగా బదిలీ**
**4 సంవత్సరాలకు పైగా కొనసాగించరాదని స్పష్టం 31-–05-–2027 లోపు రిటైర్మెంట్ ఉన్న ఉద్యోగులకు ప్రత్యేక రాయితీ.**

# భూ వివాదాల పరిష్కారంలో సువర్ణాధ్యాయం

- **కుసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్**
- **భూమి హక్కులకు శాశ్వత భరోసా**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ముద్ర, తెలంగాణ బ్యూరో:



రైతు జీవితం భూమితో ముడిపడి ఉందని, ఆ భూమిపై హక్కు స్పష్టంగా ఉన్నప్పుడే అతని జీవితం భద్రంగా ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆ హక్కును సర్వే మ్యాప్‌తో, భూధార్ నంబర్‌తో శాశ్వతంగా నిర్ధారించినపుడే రైతుకు ధైర్యం, కుటుంబానికి భరోసా, భవిష్యత్తుపై నమ్మకం కలుగుతుందన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని కుసుమంచి మండలంలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ చేసి చారిత్రాత్మకమైన అడుగు వేశామన్నారు. సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ అయిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను సమూలంగా బలోపేతం చేస్తూ, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈనెల 2 నుంచి నారాయణపేట జిల్లా కొస్గి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అనే నిబంధనను భూభారతి చట్టంలో పొందుపరిచామని చెప్పారు. కుసుమంచి మండలంలోని గట్టుసింగారం రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 156/ఇ/1 లోగల ఒక ఎకరా నాలుగు గుంటల భూమిని నేలకొండపల్లి మండలం ముత్తాపురం గ్రామానికి చెందిన చెందిన భాగం కిషన్‌రావు అనే రైతు అదే గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వరరావుకు విక్రయిస్తున్న సందర్భంగా తన భూమి హద్దులతో కూడిన మ్యాప్ ను జతచేసి కూసుమంచి తహశీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. దీనికి సంబంధించి (భూ కమత పటము1, భూధార్ నెంబర్ 795GCHDCUPJ7H0) ను తహసీల్దార్ కేటాయించారు. ఇదే విధానాన్ని దశలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభించేవిధంగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. సర్వే విషయంలో పాత విధానాలకు స్వస్తి చెప్పి అధునాతన రోవర్లను వినియోగిస్తూ కచ్చితత్వంతో సర్వే పూర్తిచేయిస్తున్నామని తెలిపారు.

# వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ దే అధికారం

- **కేసీఆర్, రేవంత్ రెడ్డిలో ఎవరెంటో తేలిపోయింది**
- **జగిత్యాలలో కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాల గురించి మాట్లాడారు**
- **నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి రహస్యం లేదు**
- **మాజీ మంత్రి హరీశ్ రావు**

ముద్ర, తెలంగాణ బ్యూరో:



తెలంగాణ కోసం తపించే కేసీఆర్, చిల్లర మాటలు మాట్లాడే రేవంత్ రెడ్డి గురించి రాష్ట్రంలో అందరికీ తెలిసిపోయిందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. వచ్చే ఎన్నికల్లో నూటికి నూరు శాతం రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగిత్యాల సభలో కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాల గురించి అత్యంత హుందాగా మాట్లాడారని పేర్కొన్నారు. తన ఢిల్లీ పర్యటనపై సీఎంవో ఇచ్చిన లీకులను హరీష్ రావు కొట్టిపారేశారు. తన ఢిల్లీ పర్యటనలో ఎలాంటి రహస్యం లేదన్నారు. ఫిరాయింపుల కేసుపై న్యాయ నిపుణులతో చర్చించేందుకే ఢిల్లీకి వెళ్లినట్లు స్పష్టం చేశారు. అందరి కళ్లముందే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విమానం ఎక్కాను తప్ప ,దొంగచాటుగా వెళ్లలేదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో 'ఓటుకు నోటు' కేసు విచారణ ఉందని, అందులో బీఆర్ఎస్ ఇంప్లీడ్ అయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రహస్య భేటీలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. రాత్రి రాహుల్ గాంధీని కలిసి, ఉదయం కేంద్ర మంత్రులను, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలను కలవడం రేవంత్ రెడ్డికే వెన్నతో పెట్టిన విద్య అని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. పనిలేని వారే తన పర్యటనలపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
22.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## సైకిల్ చరిత్ర

సైకిల్ పరిశ్రమ ఆటోమొబైల్ పరిశ్రమకు కూడా పునాది వేసింది. చాలా టెక్నాలజీలు కార్ల తయారీలో ఉపయోగించబడ్డాయి.



# కెనడా జట్టులో ఫిక్సింగ్ కలకలం

- టీ20 వరల్డ్ కప్‌లో ఐసీసీ విచారణ.. బిష్ణోయ్ గ్యాంగ్ ప్రమేయం అనుమానం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**



ఈ ఏడాది టీ20 వరల్డ్ కప్‌లో కెనడా జట్టుకు సంబంధించిన ఫిక్సింగ్ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC) ఇప్పటికే ఈ వ్యవహారంపై విచారణ ప్రారంభించింది. ఈ వివాదంలో భారత్‌లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రమేయం ఉందనే వార్తలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఐసీసీ అవినీతి నిరోధక విభాగం (ACU) ప్రస్తుతం కెనడా కెప్టెన్ దిల్‌ప్రీత్ బాజ్వా పాత్రపై దర్యాప్తు కొనసాగిస్తోంది. కెనడియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (CBC) కథనం ప్రకారం, కెనడా జట్టు కెప్టెన్ దిల్‌ప్రీత్ బాజ్వా నియామకం వెనుక, మ్యాచ్‌లను ఫిక్సింగ్ చేసే వ్యూహాల వెనుక బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం ఉన్నట్టు సమాచారం వెలుగులోకి వచ్చింది. ఈ కుంభకోణం మూలాలు 2025 జులైలో బ్రిటిష్ కొలంబియాలోని సర్రే ప్రాంతంలోని ఒక రెస్టారెంట్ సమావేశంతో ముడిపడి ఉన్నట్టు తెలుస్తోంది. ఒక ప్రాంతీయ టోర్నమెంట్ ముగిసిన అనంతరం సుమారు 25 మంది క్రికెటర్లు అక్కడ సమావేశమయ్యారు. ఆ సమయంలో ఇద్దరు ఆటగాళ్లు ఒక స్టార్ ఆటగాడు వద్దకు వెళ్లి, తాము బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వారమని చెబుతూ దిల్‌ప్రీత్ బాజ్వాకు మద్దతు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్టు సమాచారం. 'నోహ' అనే మరో వ్యక్తికి కూడా గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చినట్టు వెల్లడైంది. తనను భయపెట్టేందుకు బిష్ణోయ్ ముఠా ఒక ఫోటోను మెసేజ్ చేసినట్టు, జట్టు ఎంపికలో తమకు అనుకూల వ్యక్తులను ఉంచేందుకు ఒత్తిడి తెచ్చినట్టు తెలిపినట్టు సమాచారం. దిల్‌ప్రీత్ బాజ్వాను కెప్టెన్‌గా ఎంపిక చేయడం కూడా వివాదాస్పదంగా మారింది. 2026 టీ20 వరల్డ్ కప్‌కు కొద్ది వారాల ముందు అతనికి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడం అనుమానాలకు తావిచ్చింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బాజ్వా వేసిన ఒక ఖరీదైన ఓవర్‌పై ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ దృష్టి సారించింది. దీంతో అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అధికారులు విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో క్రికెట్ కెనడా ప్రెసిడెంట్ అరవిందర్ ఖోసా పాత్రపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన పదవిలోకి రాకముందే బాజ్వాను కెప్టెన్ చేయాలని ప్రతిపాదించారని, మ్యాచ్‌ల ఫిక్సింగ్ ద్వారా డబ్బు సంపాదించడమే గ్యాంగ్ లక్ష్యమనే ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను ఖోసా ఖండిస్తూ, తన ప్రతిష్టను దెబ్బతీయడానికి జరుగుతున్న రాజకీయ కుట్రగా అభివర్ణించారు.



# మొదటి బంతికే వికెట్ తీసిన బుమ్రా

## 276 టీ20 మ్యాచ్‌ల తర్వాత అరుదైన ఘనత నమోదు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

జస్ప్రీత్ బుమ్రా అరుదైన బౌలర్‌గా పేరుగాంచిన ఆటగాడు. టాప్ బ్యాటర్లను వణికించిన బుమ్రా ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్‌లో వికెట్లు తీయడంలో కొంత ఇబ్బంది పడ్డాడు. అయితే సోమవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తన తొలి వికెట్ నమోదు చేశాడు. ఈ సీజన్‌లో ఆడిన ఏడో మ్యాచ్‌లో వికెట్ తీశాడు. ఏకంగా 146 బంతుల తర్వాత తన తొలి వికెట్ పడగొట్టడంతో పాటు 276 టీ20 మ్యాచ్‌ల నిరీక్షణకు తెరదించాడు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 199 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో బుమ్రా బంతితో మెరుపు చూపించాడు. తన టీ20 కెరీర్‌లో తొలిసారిగా ఇన్నింగ్స్ తొలి బంతికే వికెట్ తీసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ సాయి సుదర్శన్‌ను గోల్డెన్ డక్‌గా వెనక్కి పంపి ప్రత్యర్థి జట్టుకు షాక్ ఇచ్చాడు. మరోవైపు ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ ఆరు మ్యాచ్‌ల్లో మూడుసార్లు ఇన్నింగ్స్ తొలి బంతికే వికెట్ తీసి ప్రత్యేక రికార్డు నమోదు చేశాడు. అయితే బుమ్రాకు ఇలాంటి అవకాశం తక్కువగా రావడానికి కారణం కూడా ఉంది. తన సుదీర్ఘ టీ20 కెరీర్‌లో బుమ్రా కేవలం 16 సార్లు మాత్రమే బౌలింగ్‌ను ఆరంభించాడు. ఐపీఎల్‌లో కొత్త బంతితో ఇన్నింగ్స్ ప్రారంభించడం అతనికి ఇది ఆరోసారి మాత్రమే. గణాంకాలను పరిశీలిస్తే కొత్త బంతితో బుమ్రా ఎంత ప్రమాదకరమో స్పష్టమవుతోంది. ఓపెనింగ్ బౌలర్‌గా దిగిన 16 ఇన్నింగ్స్‌ల్లో అతను 23 వికెట్లు పడగొట్టాడు. ఓపెనింగ్ బౌలర్‌గా దిగి వికెట్ తీయకుండా వెనుదిరిగింది అతని కెరీర్‌లో కేవలం రెండుసార్లు మాత్రమే, చివరిసారి 2014లో జరిగింది. ఈ గణాంకాలను పరిశీలిస్తే ముంబై ఇండియన్స్ జట్టు ఇకపై ప్రతి మ్యాచ్‌లోనూ బుమ్రాతోనే బౌలింగ్ ఆరంభించడం మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సీఎస్‌కేకు డూ ఆర్ డై

## ముంబైపై గెలిస్తేనే ప్లే ఆఫ్స్ ఆశలు!


- ఐపీఎల్ 2026లో ఆందోళనకరంగా సీఎస్‌కే పరిస్థితి
- ఆరు మ్యాచ్‌లలో రెండు విజయాలు
- ముంబైపై గెలిస్తేనే సీఎస్‌కేకు ప్లే ఆఫ్స్ ఆశలు



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

సీఎస్‌కేకు 'డూ ఆర్ డై'.. ముంబైపై గెలిస్తేనే ప్లే ఆఫ్స్ ఆశలు! ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు ఆడిన సీఎస్‌కే.. కేవలం రెండు విజయాలు మాత్రమే అందుకుంది. ప్రస్తుతం 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో ఉంది. ఇప్పటికే లీగ్ దశలో దాదాపుగా సగం మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే.. ఇకపై ప్రతి మ్యాచ్ సీఎస్‌కేకు అత్యంత కీలకం. ఒక్కో మ్యాచ్ ఓడిపోతే.. ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లుతుంటాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 23న వాంఖడేలో ముంబై ఇండియన్స్ (ఎంఐ)పై గెలవడం తప్పనిసరి. మరోవైపు ముంబై ఇండియన్స్ కూడా సీఎస్‌కే లాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది. తాజాగా గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించి 4 పాయింట్లతో తిరిగి పోటీలోకి వచ్చింది. ముంబై జట్టుకు మంచి కాంబినేషన్ ఉండటంతో.. బలంగా తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముంబైకి కూడా సీఎస్‌కేతో జరగనున్న మ్యాచ్ కీలకం కానుంది. సీఎస్‌కే, ఎంఐ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఓడిన జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిలుతాయి. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ 11 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులో ముందంజలో ఉంది. అలాగే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ జట్లు 8 పాయింట్లతో బలమైన స్థితిలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో సీఎస్‌కే ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే.. ఇకపై తప్పనిసరిగా వరుస విజయాలు సాధించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ముంబైపై జరిగే మ్యాచ్‌లో గెలిస్తే సీఎస్‌కే 6 పాయింట్లకు చేరుకుని ఆశలను సజీవంగా ఉంచుకోగలదు. అదే సమయంలో ముంబైని 4 పాయింట్ల వద్దే ఉంటుంది. ఓడిపోతే సీఎస్‌కే ప్లే ఆఫ్స్ ఆశలు ప్రమాదంలో ఉంటాయి. ఈ కీలక సమయంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఎలా జట్టును నడిపిస్తాడో చూడాలి. మొత్తానికి సీఎస్‌కేకు ఇది డూ ఆర్ డై పరిస్థితి అనే చెప్పాలి.

# యువ ఆటగాళ్లలో ప్రియాంశ్ ఆర్య ముందంజ: అశ్విన్



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

గత వారం లక్నో సూపర్ జెయింట్స్ జట్టుపై పంజాబ్ కింగ్స్ బ్యాటర్ ప్రియాంశ్ ఆర్య 37 బంతుల్లో 93 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. గతేడాది ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన ఈ 24 ఏళ్ల ఆటగాడు అప్పుడే 475 పరుగులు సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. లక్నోపై ప్రియాంశ్ ఆడిన ఇన్నింగ్స్ అనంతరం రవిచంద్రన్ అశ్విన్ తన YouTube ఛానెల్‌లో ప్రియాంశ్ ఆర్యను ప్రశంసించాడు. ప్రస్తుత ఐపీఎల్‌లో రాణిస్తున్న యువ ఆటగాళ్లు ఆయుష్ మ్హాత్రే, వైభవ్ సూర్యవంశీ కంటే ప్రియాంశ్ ఒక అడుగు ముందే ఉన్నాడని అభిప్రాయపడ్డాడు. ఎవరినీ తక్కువ చేసి మాట్లాడటం లేదని పేర్కొంటూ, ప్రియాంశ్ ఆడే తీరు అద్భుతమని, అతని వద్ద షాట్ల రేంజ్ ఎక్కువగా ఉందని అశ్విన్ తెలిపాడు. పెద్ద స్కోర్లు సాధించడంలో మిగిలిన యువ ఆటగాళ్ల కంటే అతను మెరుగ్గా కనిపిస్తున్నాడని వ్యాఖ్యానించాడు. ఈ సీజన్‌లో మెరుగైన గణాంకాలు* ఈ సీజన్‌లో ప్రియాంశ్ ఆర్య గణాంకాలను పరిశీలిస్తే 5 మ్యాచ్‌ల్లో 211 పరుగులు సాధించాడు. అతని సగటు 42.2గా ఉండగా, 248కుపైగా స్ట్రైక్‌రేట్‌తో కొనసాగుతున్నాడు. 11 బంతుల్లో 39, 20 బంతుల్లో 57, 37 బంతుల్లో 93 పరుగులు వంటి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మరోవైపు ఇతర యువ ఆటగాళ్లలో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడుతున్న ఆయుష్ మ్హాత్రే హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఆయుష్ 6 ఇన్నింగ్స్‌ల్లో 33.50 సగటుతో 201 పరుగులు చేశాడు. ఇక రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న వైభవ్ సూర్యవంశీ 6 మ్యాచ్‌ల్లో 246 పరుగులు సాధించి టోర్నమెంట్‌లో టాప్ పర్ఫార్మర్లలో ఒకడిగా కొనసాగుతున్నాడు. నిలకడగా భారీ స్కోర్లు చేసే సత్తా, అద్భుతమైన స్ట్రైక్‌రేట్ ఉండటంతో ప్రియాంశ్ ఆర్య భవిష్యత్తుపై సీనియర్ ఆటగాళ్లు విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఉప్పల్ లో సెంచరీతో అభి'షేక్' విధ్వంసం

## దెబ్బకు ఐపీఎల్ లో ఆ'రేంజ్' క్యాప్ సొంతం



**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ లో మంగళవారం ఢిల్లీ జట్టుతో జరిగిన మ్యాచ్లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు సన్ రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ.. లుంగీ ఎంగిడి నుంచి మొదలుపెడితే.. నితీష్ రానా వరకు బౌలర్ నూ వదిలిపెట్టలేదు.. 47 బంతుల్లో అభిషేక్ శర్మ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు.. ఈ కథనం రాసే సమయం వరకు అతడు 51 బంతులలో 115 పరుగులు చేశాడు. చెన్నై జట్టుతో జరిగిన మ్యాచ్లో అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీ చేశాడు. ఇప్పుడు ఢిల్లీ జట్టుతో జరిగిన మ్యాచ్ లో ఏకంగా సెంచరీ చేశాడు. తొలి వికెట్ కు హెడ్ తో కలిసి 97, రెండో వికెట్ కు ఇషాన్ కిషన్ తో కలిసి 79 పరుగుల భాగస్వామ్యాలను నమోదు చేశాడు. ఈ సెంచరీ ద్వారా అభిషేక్ సరికొత్త రికార్డును సృష్టించాడు. ఈ సెంచరీ ద్వారా దెబ్బకు ఆరెంజ్ క్యాప్ హోల్డర్ గా నిలబడ్డాడు అభిషేక్.. ఏడు మ్యాచ్లు ఆడిన అతడు 50.83 సగటుతో 305 పరుగులు చేశాడు. ఇందులో 23 ఫోర్లు, 27 సిక్సర్లు ఉన్నాయి. ఫోర్ల కంటే, సిక్సర్లు అధికంగా ఉన్నాయంటే అతడి బ్యాటింగ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అభిషేక్ ఈ టోర్నీలో ప్రారంభ మ్యాచ్లలో ఇబ్బంది పడ్డాడు. పరుగులు తీయడంలో తడబడ్డాడు. దీంతో అతడిని ఎందుకు తీసుకున్నారని విమర్శలు వినిపించాయి. చివరికి అభిషేక్ గట్టిగా నిలబడ్డాడు. తన బ్యాటింగ్ స్టైల్ మొత్తం మార్చుకున్నాడు. చెత్త బంతులను శిక్షించిన అతడు.. ఇబ్బంది పెట్టే బంతులకు మాత్రం రెస్పెక్ట్ ఇచ్చాడు. అందువల్లే ఒక హాఫ్ సెంచరీ, ఒక సెంచరీ వరసగా చేసి అదరగొట్టాడు. మొత్తంగా ఉప్పల్ మైదానాన్ని షేక్ చేశాడు.

# చెన్నైకి మరో ఎదురు దెబ్బ

గాయంతో కీలక బ్యాటర్ అవుట్



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు మరో పెద్ద షాక్ తగిలింది. ఇప్పటికే ఆశించిన స్థాయిలో రాణించలేక ఇబ్బందులు పడుతున్న జట్టుకు ఇప్పుడు కీలక బ్యాటర్ గాయం రూపంలో దూరమయ్యాడు. తొడ కండరాల గాయం కారణంగా మిగతా మ్యాచ్‌లకు ఆయుష్ మాత్రే దూరమవుతున్నట్లు జట్టు యాజమాన్యం వెల్లడించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తుండగా ఆయుష్ మాత్రే గాయపడ్డాడు. పరీక్షించిన వైద్యులు అతడు పూర్తిగా కోలుకోవడానికి 6 నుంచి 12 వారాల సమయం పడుతుందని తెలిపారు. దీంతో ఈ సీజన్ మొత్తం అతడు ఆడే అవకాశం లేకుండా పోయింది. ఈ సీజన్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడిన ఆయుష్ మాత్రే 201 పరుగులు చేసి జట్టుకు ఉపయోగపడుతున్న సమయంలోనే గాయం రావడం చెన్నైకు పెద్ద నష్టంగా మారింది. అయితే ఈ పరిస్థితుల్లో వచ్చే మ్యాచ్‌లో మహేంద్ర సింగ్ ధోని ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో అభిమానుల్లో కొంత ఊరట నెలకొంది.

# ఉప్పల్‌లో నిమ్మకాయల హడావిడి

- ఎస్ఆర్‌హెచ్ విజయాలకు సోషల్ మీడియాలో కొత్త ట్రెండ్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

గతంలో ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ అంటే సిక్సర్ల వర్షం కురిసేది. అయితే ప్రస్తుతం ఆ ట్రెండ్‌కు భిన్నంగా సోషల్ మీడియాలో కొత్త హడావిడి మొదలైంది. సిక్సర్ల కంటే 'నిమ్మకాయలు' గురించే ఎక్కువ చర్చ జరుగుతోంది. ఇటీవల రెండు మ్యాచ్‌ల్లో వరుస విజయాలు సాధించిన ఎస్ఆర్‌హెచ్ ప్రదర్శనపై నెటిజన్లు వినూత్నంగా స్పందిస్తున్నారు. ఆటగాళ్ల ప్రతిభతో పాటు 'నిమ్మకాయల ప్రభావం' కూడా ఉందంటూ సరదాగా ట్రోల్స్ చేస్తున్నారు. ప్రత్యర్థి జట్టు వికెట్లు పడటానికి స్టేడియంలో ఎవరైనా నిమ్మకాయలతో పూజలు చేస్తున్నారనే మీమ్స్ వైరల్ అవుతున్నాయి. ప్రత్యర్థి వికెట్లు వరుసగా కూలుతున్నా, ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లు దూకుడుగా ఆడుతున్నా దీనికి కారణం నిమ్మకాయలేనని అభిమానులు సరదాగా పోస్టులు పెడుతున్నారు. టిక్కెట్ల కంటే నిమ్మకాయలకే డిమాండ్ పెరిగిందని, ఉప్పల్ స్టేడియం పేరు కూడా 'నిమ్మకాయల స్టేడియం'గా మారిపోయిందని మీమ్స్ చక్కర్లు కొడుతున్నాయి. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో ఒక వ్యక్తి నిమ్మకాయతో ఏదో మంత్రం చేస్తున్నట్లు నటించగా, వెంటనే బ్యాటర్ ఔట్ కావడం ఈ ట్రెండ్‌కు మరింత ఊపునిచ్చింది. ఆ సంఘటన ఆధారంగా చెన్నై జట్టు నిమ్మకాయలతో మాయ చేశారంటూ ఫిర్యాదు చేసినట్లు నకిలీ లేఖను కూడా సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో తదుపరి మ్యాచ్‌ల్లో నిమ్మకాయలను స్టేడియంలో నిషేధించాలనే డిమాండ్ కూడా వినిపిస్తోంది. మొత్తానికి ఎస్ఆర్‌హెచ్ విజయాల కంటే 'నిమ్మకాయల' ట్రెండ్ ఇప్పుడు క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటోంది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
22.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews







## మోస్ట్ పాపులర్ స్టార్స్ జాబితా విడుదల

## టాప్‌లో ప్రభాస్, సమంత

### ఓరామాక్స్ విడుదల చేసిన మార్చి ర్యాంకింగ్స్

ముద్ర, సినిమా డెస్క్:

టాలీవుడ్ స్టార్ హీరోలు, హీరోయిన్లలో క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని మరోసారి స్పష్టమైంది. దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ తారలు మళ్లీ టాప్ స్థానాల్లో నిలిచారు. మార్చి నెలకు సంబంధించిన మోస్ట్ పాపులర్ ఫిలిం స్టార్ల జాబితాను ఓరామాక్స్ మీడియా విడుదల చేయగా, హీరోలలో ప్రభాస్, హీరోయిన్లలో సమంత అగ్రస్థానాల్లో నిలిచారు. హీరోల విభాగంలో ప్రభాస్ మొదటి స్థానాన్ని దక్కించుకోగా, ఆయన తరువాత అల్లు అర్జున్, విజయ్ దళపతి, షారుఖ్ ఖాన్, మహేష్ బాబు వరుసగా నిలిచారు. అలాగే రామ్ చరణ్, సల్మాన్ ఖాన్, రణవీర్ సింగ్, ఎన్టీఆర్, అక్షయ్ కుమార్ కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఈ ర్యాంకింగ్స్ స్టార్ హీరోల పాపులారిటీని మరోసారి చూపిస్తున్నాయి. హీరోయిన్ల జాబితాలో సమంత టాప్ ప్లేస్ సాధించగా, ఆమె తరువాత ఆలియా భట్, రష్మిక మందన్న, కాజల్ అగర్వాల్, సాయి పల్లవి ఉన్నారు. నయనతార, త్రిష, కృతి సనన్, శ్రీలీల కూడా ఈ జాబితాలో తమ స్థానాలను సంపాదించుకున్నారు. మొత్తంగా చూస్తే, సౌత్ మరియు బాలీవుడ్ తారలు కలిసి ఈ జాబితాలో ఆధిపత్యం చాటడం విశేషం. అభిమానుల్లో వీరి క్రేజ్ ఇంకా బలంగానే కొనసాగుతోందని ఈ ర్యాంకింగ్స్ స్పష్టం చేస్తున్నాయి

## సిల్వర్ అండ్ గోల్డ్ లుక్‌లో ఐశ్వర్య మేనన్

### ఫోటోషూట్‌తో ఆకట్టుకున్న అందాల తార

ముద్ర, సినిమా డెస్క్:

దక్షిణాది చిత్రాల్లో తన ప్రతిభతో గుర్తింపు తెచ్చుకున్న నటి ఐశ్వర్య మేనన్ మరోసారి వార్తల్లో నిలిచింది. తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ భాషల్లో నటిస్తూ మంచి గుర్తింపు పొందిన ఈ బ్యూటీ, ముఖ్యంగా కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. టాలీవుడ్‌లో కూడా 'స్పై', 'భజే వాయు వేగం' సినిమాల ద్వారా అదృష్టం పరీక్షించుకున్నప్పటికీ, ఆ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని సాధించలేకపోయాయి. తెరపై ఆశించిన స్థాయి రాకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం ఐశ్వర్య తన స్టైల్‌తో అభిమానులను కట్టిపడేస్తోంది. తాజాగా చేసిన ఫోటోషూట్‌లో ఆమె గ్లామర్ మరో లెవెల్‌లో కనిపించింది. సిల్వర్‌గోల్డ్ సీక్విన్ చీరలో, హెవీ ఎంబ్రాయిడరీ కార్సెట్ బ్లౌజ్‌తో ఆమె లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ స్టైలిష్ లుక్‌లో ఐశ్వర్య మేనన్ అందం మరింత హైలైట్ కావడంతో ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఆమె గ్లామర్, ఎలిగెన్స్ కలగలిపిన తీరు ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, నెటిజన్ల ప్రశంసలు అందుకుంటున్నాయి.







## 'కింగ్100'లో ఐశ్వర్య రాజేష్

### సోషల్ మీడియాలో హీరోయిన్ రివీల్‌తో సర్ప్రైజ్

ముద్ర, సినిమా డెస్క్:

అక్కినేని నాగార్జున 100వ చిత్రం 'కింగ్ 100' ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. కోలీవుడ్ దర్శకుడు రా. కార్తీక్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ మనాలిలో శరవేగంగా సాగుతోంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ అనుకోకుండా రివీల్ చేసింది. ఇంతకాలం సీక్రెట్‌గా ఉంచిన ఆమె పాత్ర, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలతో బయటపడింది. హిమాచల్ ప్రదేశ్ సంప్రదాయ దుస్తుల్లో ఆమె పోస్ట్ చేసిన ఫోటోలు, దర్శకుడితో కలిసి ఉన్న పిక్స్‌తో ఆమె ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నట్టు క్లారిటీ వచ్చింది. సహజ నటనకు పేరుగాంచిన ఐశ్వర్య రాజేష్, నాగార్జున సరసన కనిపించబోతుండటంతో ఈ కాంబినేషన్‌పై ఆసక్తి పెరిగింది. మనాలి షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున నిర్మిస్తున్న ఈ చిత్రం భారీ అంచనాలతో ముందుకు సాగుతోంది. ఐశ్వర్య ఎంట్రీతో సినిమాకు మరింత హైప్ పెరిగిందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



## నువేక్ష హాట్ షో

### ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో హల్‌చల్

ముద్ర, సినిమా డెస్క్:

యంగ్ బ్యూటీ నువేక్ష తన తాజా ఫోటోషూట్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. స్టైలిష్ లుక్స్‌తో ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్న ఈ హీరోయిన్, ఇప్పుడు మరింత గ్లామర్ టచ్‌తో ఫ్యాన్స్‌ను మెస్మరైజ్ చేస్తోంది. క్రీమ్ వైట్ కలర్ కట్‌అవుట్ డ్రెస్‌లో నువేక్ష కనిపించిన తీరు ప్రత్యేకంగా నిలిచింది. గోల్డ్ బకుల్ డీటైల్స్‌తో డిజైన్ చేసిన ఈ అవుట్‌ఫిట్ బోల్డ్‌గా ఉన్నప్పటికీ క్లాసీ లుక్‌ను ఇస్తోంది. నేచురల్ లైట్‌లో తీసిన ఈ ఫోటోలు డ్రీమీ ఫీల్‌ను కలిగిస్తూ ప్రతి ఫ్రేమ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. సన్‌లైట్ విండోస్ దగ్గర పోజులు ఇచ్చినా, డార్క్ బ్యాక్‌డ్రాప్ ముందు నిలిచినా నువేక్ష కాన్ఫిడెన్స్ స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె ఎలిగెంట్ స్టైల్‌తో పాటు స్క్రీన్ ప్రెజెన్స్ ప్రతి ఫోటోలో హైలైట్ అవుతోంది. ఈ కొత్త అవతార్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, నువేక్ష అందంపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు

## 'రాకా' కోసం బన్నీ కొత్త రూల్...

- **లాభాల్లో వాటా మోడల్‌కు ఓకే**
- **రెమ్యూనరేషన్ విషయంలో అల్లు అర్జున్ సంచలన నిర్ణయం**

**ముద్ర, సినిమా డెస్క్:**


ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'రాకా' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే బన్నీ తన రెమ్యూనరేషన్ విషయంలో తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా స్టార్ హీరోలు భారీ పారితోషికం తీసుకుంటున్న సమయంలో, అల్లు అర్జున్ మాత్రం ఈ సినిమాకు ఫిక్స్‌డ్ రెమ్యూనరేషన్‌ను పక్కనపెట్టి, లాభాల్లో వాటా తీసుకునే విధానాన్ని ఎంచుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అంటే సినిమా బాక్సాఫీస్ వద్ద ఎంత పెద్ద హిట్ అయితే, ఆయనకు అంత ఎక్కువగా ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పటికే టాలీవుడ్‌లో చిరంజీవి, మహేష్ బాబు, ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి అగ్ర హీరోలు ఈ మోడల్‌ను అనుసరిస్తున్నారు. కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ కూడా ఇదే పద్ధతిని పాటిస్తూ ముందంజలో ఉన్నారు. ఇప్పుడు అల్లు అర్జున్ కూడా అదే దారిలో నడవడం విశేషంగా మారింది. భారీ బడ్జెట్ సినిమాల నేపథ్యంలో ఈ తరహా నిర్ణయం నిర్మాతలకు ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు. అలాగే సినిమా విజయంపై హీరో బాధ్యత కూడా పెరుగుతుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి, అల్లు అర్జున్ తీసుకున్న ఈ నిర్ణయం ఇండస్ట్రీలో కొత్త ట్రెండ్‌కు నాంది పలికేలా ఉందని, కంటెంట్‌పై తనకు ఉన్న నమ్మకాన్ని ఆయన మరోసారి నిరూపించుకున్నారని అభిమానులు అభినందిస్తున్నారు.

## ట్రంప్‌తో సినిమా ప్రమోషన్...


- **షాక్ ఇచ్చిన తరుణ్ భాస్కర్**
- **ఏఐ వీడియోతో 'గాయపడ్డ సింహం'కు క్రియేటివ్ పబ్లిసిటీ**

ముద్ర, సినిమా డెస్క్:

టాలీవుడ్ దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ తన కొత్త సినిమా ప్రమోషన్స్‌లో మరోసారి వినూత్నంగా ఆలోచించి అందరినీ ఆకట్టుకున్నారు. 'గాయపడ్డ సింహం' సినిమా రిలీజ్ సమయం దగ్గరపడుతుండటంతో, మేకర్స్ క్రియేటివ్ ప్రమోషన్ స్ట్రాటజీని ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలోనే ఏఐ టెక్నాలజీతో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఒక ఫన్నీ వీడియో రూపొందించడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియోలో ట్రంప్ టీ తాగుతూ "ఇండియన్ టీ వెరీ నైస్" అని చెప్పగా, తరుణ్ భాస్కర్ వెంటనే "నేను ఇచ్చింది ఇరాన్ టీ" అంటూ సరదాగా స్పందించడం నవ్వులు పూయిస్తోంది. ఈ వీడియో చివర్లో చేసిన ప్రత్యేక ప్రకటన కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. "ఈ సినిమాను ఇరాన్ మినహా ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నాం" అనే డైలాగ్ నెటిజన్లను విపరీతంగా ఎంటర్టైన్ చేస్తోంది. మొత్తానికి, ఈ ఏఐ ప్రమోషన్‌తో 'గాయపడ్డ సింహం' సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. విడుదలకు ముందే క్రియేటివ్ పబ్లిసిటీతో తరుణ్ భాస్కర్ మరోసారి తన ప్రత్యేకతను చూపించారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.








## డిజిటల్ ప్లాట్ ఫామ్ లో సిద్ధూ–మీనాక్షి జోడీ

ముద్ర, సినిమా డెస్క్:

టాలీవుడ్ యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ, దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ వెబ్ సిరీస్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి ఎంపిక కావడం ప్రత్యేకంగా చర్చనీయాంశంగా నిలిచింది. వరుస విజయాలతో ఫుల్ ఫామ్‌లో ఉన్న ఈ బ్యూటీ, ఇప్పుడు డిజిటల్ రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇటీవల తెలుగులో మీనాక్షి చౌదరి మంచి జోరు చూపిస్తోంది. కమర్షియల్ సినిమాలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకుల దగ్గరకి చేరువవుతోంది. అందుకే ఈ ప్రతిష్టాత్మక వెబ్ సిరీస్‌లో ఆమెను తీసుకోవడం పట్ల మేకర్స్ కూడా ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది. సిద్ధూ స్టైల్‌కు మీనాక్షి గ్లామర్, నటన కలిస్తే ఈ సిరీస్ మరో స్థాయికి వెళ్లే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. వీరిద్దరి జోడీ తెరపై ఫ్రెష్‌గా కనిపిస్తుందనే టాక్ వినిపిస్తోంది. ప్రఖ్యాత ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సిరీస్‌ను భారీ బడ్జెట్‌తో రూపొందిస్తోంది.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com